పేజీలు :12
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 | సంచిక : 156 | శనివారం 21-3-2026 | పేజీలు 12 | వేల 5/-



- రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా
- కుటుంబ పెద్ద ఏ కారణంతో మరణించినా పరిహారం
- పాఠశాల విద్యార్థులకు అల్పాహారంగా పాలు, రాగి జావ
- ఇంటర్ విద్యార్థులకూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం
- పట్టాలపైకి ప్రభుత్వోద్యోగుల నగదు రహిత ఆరోగ్య పథకం
- దేశంలోనే తొలిసారిగా ఉద్యోగులకు ప్రమాద బీమా స్కీం
- ఉద్యోగి ప్రమాదంలో మరణిస్తే కుటుంబానికి 1.2 కోట్లు
- చేయూత పథకం కింద మరో రెండు లక్షల పింఛన్లకు ఓకే

# అందరికీ బీమా..ఆహార ధీమా!

## బడ్జెట్లో కొత్త పథకాలను ప్రకటించిన రేవంత్ సర్కార్.. సకల జనులపై వరాల జల్లులు

### రేషన్ కార్డుదారులకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం

**హైద్రాబాద్, మార్చి 20 :మీడియా టుడే**
రాష్ట్రంలోని సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన మూడో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అడుగడుగునా ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నా.. ప్రీ ప్రైమరీ విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరిపైనా వరాలు కురిపించింది. ఆదాయం పెంచుకుంటూనే అభివృద్ధికి బాటలు పరుస్తున్నామని సంకల్పం చెప్పుకొంది. ఈ మేరకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో; సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసన మండలిలో శుక్రవారం ప్రవేశపెట్టారు. “బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు. ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు. ప్రజల జీవన స్థితిగతుల మార్పుకు దోహదపడే లెక్కలు” అని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న ఆయన.. అందుకు అనుగుణంగానే కీలక పథకాలను ప్రకటించారు. ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యం కాని రీతిలో, కనీవినీ ఎరుగని మహత్తర ‘ఇందిరమ్మ జీవిత బీమా పథకాని’కి శ్రీకారం చుడుతున్నామన్నారు.

**పథకాలకు పెద్దపీట**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతోపాటు పాత, కొత్త పథకాలన్నింటికీ కలిపి ఈసారి ఏకంగా రూ.1,45,591 కోట్లను కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వీటికి కేవలం రూ.1,04,329 కోట్లను మాత్రమే కేటాయించగా.. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.41,262 కోట్లను అదనంగా కేటాయించడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.3,04,965 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. దీనికి రూ.19,269 కోట్లను పెంచి రూ.3,24,234 కోట్లతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను సమర్పించింది. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు కాగా; మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా ప్రతిపాదించారు. అంటే... పాత బడ్జెట్ కంటే కొత్త బడ్జెట్ 6.31 శాతం ఎక్కువ. బడ్జెట్లో సాగు, సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఈ రెండు రంగాలకే మొత్తం బడ్జెట్లో 26.66 శాతం నిధులు కేటాయించారు. ఇందులో వ్యవసాయం, సహకారం, పశు సంవర్ధక, మత్స్య, సాగునీటిపారుదల వంటి రైతు సంబంధిత శాఖలకు 14.59 శాతం నిధులు; ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా, శిశు సంక్షేమానికి 12.07 శాతం నిధులు కేటాయించడం విశేషం! రైతు సంబంధిత శాఖలకు రూ.47,323 కోట్లు కోటాయించారు. కానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ శాఖలకు కేటాయించిన రూ.49,486 కోట్లతో పోలిస్తే.. రూ.2,163 కోట్లు తక్కువ. ఇక, సంక్షేమ శాఖలకు ఈసారి రూ.39,144 కోట్లను కేటాయించారు. 2025-26లో ఈ శాఖలకు కేటాయించిన రూ.36,941 కోట్ల కంటే.. ప్రస్తుత కేటాయింపులు రూ.2,203 కోట్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న విద్యా శాఖకు బడ్జెట్లో ఏకంగా రూ.26,674 కోట్లు కేటాయించారు. అనేక కొత్త పథకాలను ప్రకటించారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాల్లో 1,362 ప్రీ-ప్రైమరీ విభాగాలను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. రాబోయే విద్యా సంవత్సరంలో వీటిని 2,000 నుంచి 2,500 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించనున్నారు. ఇప్పటి వరకూ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం మాత్రమే అందుబాటులో ఉంది. ఇకనుంచి, ఈ పథకాన్ని ఇంటర్మీడియట్ వరకూ విస్తరించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నారు. అంతేనా.. ఇక నుంచి ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకూ విద్యార్థులకు అల్పాహార పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ప్రతి విద్యార్థికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందజేస్తారు. అలాగే, ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను ‘తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు’గా మార్చి.. వాటిలో అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

**ఉద్యోగులకు వరం**
బడ్జెట్లో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులపై వరాల జల్లు కురిపించారు. ప్రభుత్వోద్యోగులు, పింఛనుదారులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు దాదాపు 23,51,000 మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రకటించారు. దీనిని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు 421 ఎంప్యానెల్ ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,998 రకాల చికిత్సలు/శస్త్ర చికిత్సలు అందించనున్నారు. దీనికి ఉద్యోగుల వాటా కింద రూ.528 కోట్లు, ప్రభుత్వ వాటా కింద రూ.528 కోట్లు.. మొత్తం రూ.1026 కోట్లను ఖర్చు చేయనున్నారు. అలాగే, ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.2 కోట్ల బీమా వర్తించనుంది. 60 ఏళ్ల వరకు రూ.10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2 కోట్ల కవరేజీ వర్తిస్తుంది. ఈ పథకం, 7.57 లక్షల ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తించనుంది.

## 6 గ్యారంటీల ప్రస్తావనేదీ?

### రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి20 మీడియా టుడే**



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరోటి కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. ఆరు గ్యారంటీల ప్రస్తావనే లేని బడ్జెట్ ఇది అని విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ‘ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్‌నే చదివారేమో! ఎందుకంటే గత బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవు’అని ఎద్దేవా చేశారు. అర్చకుల వేతనాలు పెంచాలని, ధూప దీప నైవేద్యాలకు బడ్జెట్ పెంచాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా, మైనారిటీల కోసం బడ్జెట్‌ను రూ.700 కోట్లు పెంచడం ఓటు బ్యాంక్ పాలిటిక్స్‌లో భాగమేనని విమర్శించారు.

## దేశంలో పెట్రో బాంబ్

- ప్రీమియం పెట్రోల్ ధరలు రూ.2.35వరకు పెంపు
- సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథం



**న్యూఢిల్లీ, మార్చి 20 : మీడియా టుడే**
పశ్చిమాసియాలో యుద్ధం వల్ల ముడి చమురు, గ్యాస్ రవాణాపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ దేశంలో ప్రీమియం పెట్రోలు ధరలు పెరిగాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ(ఓఎంసీ)లైన ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్,హెచ్‌పీసీఎల్ సంస్థలు ప్రీమియం పెట్రోలు ధరలను ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2 నుంచి రూ.2.35 మేర పెంచుతున్నట్టు శుక్రవారం ప్రకటించాయి. పెరిగిన ధరలను తక్షణమే అమలులోకి తెచ్చాయి. దీంతో బీపీసీఎల్‌కు చెందిన స్పీడ్, హెచ్‌పీసీఎల్ పవర్, ఐఓసీఎల్ ఎక్స్‌పీ95 పెట్రోల్ ధరలు లీటరుకు రూ.2.09 నుంచి రూ.2.35 మేర పెరిగాయి. అయితే, సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం ఆయా సంస్థలు యథాతథంగా ఉంచాయి. వాహన ఇంజన్ మరింత మెరుగ్గా పని చేసేందుకు, అధిక మైలేజీ కోసం ప్రీమియం పెట్రోల్ వాడుతుంటారు. ప్రీమియం పెట్రోల్ వినియోగదారుల్లో లగ్జరీ, స్పోర్ట్స్, హైపెర్ఫార్మెన్స్ కార్ల యజమానులు అధికంగా ఉంటారు. దీంతో పెరిగిన ధరల ప్రభావం సంపన్న వర్గాలపైనే అధికంగా ఉండనుంది. యుద్ధం నేపథ్యంలో ముడిచమురు బ్యారెల్ ధర 110 డాలర్లకు చేరడమే ప్రీమియం పెట్రోల్ ధరల పెంపునకు కారణంగా తెలుస్తోంది. మరోపక్క, ఐఓసీఎల్(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) ఇండస్ట్రీయల్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 మేర పెంచింది. దీంతో రూ.87.67గా ఉన్న లీటరు ఇండస్ట్రీయల్ డీజిల్ ధర రూ.105.59కు చేరింది.

# అవి షర్మిల ఆస్తులే!

- ఎంవోయూలో ఉన్నవి ఆమెకు చెందాల్సిందే..
- కుటుంబ ఆస్తుల పంపకాలు జరగలేదు
- నలుగురు మనుమలకు సమానంగా చెందాలి
- ఇదే వైఎస్ ఉద్దేశం, ఆదేశం
- మేనల్లుడు, మేనకోడలికి జగన్ అన్యాయం
- నిజం నా దేవుడికీ, నా కుమారుడికీ తెలుసు
- బాండ్ పేపర్‌పై విజయలక్ష్మి స్పష్టీకరణ
- షర్మిలపై వైసీపీ నేతల దాడికి చెక్
- అసత్య ప్రచారం ఆపాలని హితవు
- తల్లీ చెల్లి మధ్య జగన్ ఉక్కిరి బిక్కిరి



**అమరావతి మార్చి 20 :మీడియా టుడే**
‘వైఎస్’ కుటుంబంలో ఆస్తుల గొడవ మళ్లీ రచ్చకెక్కింది. కుమార్తె షర్మిలపై వైసీపీ నేతలు వంతులవారీగా విమర్శల దాడి చేస్తుండటంతో... మరోమారు తల్లి విజయలక్ష్మి రంగంలోకి దిగారు. ‘క్లారిఫికేషన్’ రూపంలో కుమారుడు వైఎస్ జగన్‌కు షాక్ ఇచ్చారు. ‘ఆస్తుల పంపకం జరగలేదు. వైఎస్ మరణించేనాటికి ఉన్న ఆస్తులన్నీ ఉమ్మడివే’ అని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. ‘మీకేం తెలియదు. మీరు మాట్లాడొద్దు’ అన్నట్లుగా వైసీపీ నేతలకూ పరోక్ష హెచ్చరికలు పంపారు. 20 రూపాయల బాండ్ పేపర్‌పై, నోటరీ చేయించి మరీ ‘స్పష్టత’ ఇచ్చారు. ఉమ్మడి ఆస్తుల పంపకం జరగలేదని... షర్మిలకు జగన్ అన్యాయం చేస్తున్నారని విజయలక్ష్మి తేల్చిచెప్పారు.

**షర్మిలపై వ్యూహాత్మక దాడి...**
తండ్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సునీతా రెడ్డికి షర్మిల అండగా నిలిచిన సంగతి తెలిసిందే. ‘ఇలాంటి అన్న ఉంటే ప్రత్యేకంగా మరో శత్రువు అక్కర్లేదు. అన్న అనే పదానికే కళంకం’ అంటూ జగన్‌పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. గురువారం ఈ అంశంపై విశాఖలో షర్మిల సుదీర్ఘంగా మాట్లాడారు. సూటి ప్రశ్నలు సంధించారు. ‘మనస్సాక్షితో సమాధానం చెప్పాలి’ అంటూ సోదరుడికి సవాలు విసిరారు. దీంతో జగన్ మరోసారి ఆత్మరక్షణలో పడ్డారు. ఇక వ్యూహాత్మకంగా వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. వైఎస్ కుటుంబంలో జరుగుతున్న అంతర్గత పోరులోకి చంద్రబాబును లాగారు. ‘చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ’ అంటూ షర్మిలను నిందించడమే కాకుండా... ‘30 ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్న మీకు ఇప్పుడు వాటాలు ఇవ్వడమేంటి!? ఇవ్వాల్సిన అవసరం లేకున్నా... జగన్ తన స్వార్జితం నుంచి కోట్లు పంచి ఇచ్చారు’ అంటూ షర్మిలపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రెండు రోజులుగా షర్మిలను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన ముఖ్యనేతలూ సునీత, షర్మిలను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారు. ఇక... వైసీపీ సోషల్ మీడియా సంగతి సరేసరి!

# ఇక భూతల దాడులు!

- హోర్ముజ్ విముక్తికి సిద్ధమైన అమెరికా
- ఇరాన్ తీర ప్రాంతాలు, దీవుల స్వాధీనానికి ప్రణాళిక
- పశ్చిమాసియావైపు ట్రిపోలి, బాక్సర్ యుద్ధ నౌకలు
- కీలకమైన ఖార్గ్ దీవి స్వాధీనం దిశగా అడుగులు
- ఇరాక్ నుంచీ బలగాలను తరలిస్తున్న అగ్రరాజ్యం
- హోర్ముజ్ భద్రత కోసం వస్తామన్న ఆరు దేశాలు
- సైనికపరంగా జోక్యం చేసుకోవడంపై అస్పష్టత
- రష్యా చమురుపై మరోసారి ఆంక్షల సడలింపు
- కొత్త సాధారణ లైసెన్స్ జారీ చేసిన అమెరికా
- ఇరాన్ చమురుపైనా ఆంక్షలు ఎత్తేసే యోచన



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 20: మీడియా టుడే**
ఇరాన్‌పై యుద్ధం ఎటూ తేలని స్థితి, చమురు ధరల పెరుగుదల, గ్యాస్ కొరతతో ప్రపంచ దేశాలు అల్లాడుతుండటంతో.. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు అమెరికా తీవ్రస్థాయి యుద్ధానికి సన్నద్ధమవుతోంది. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలోని ఇరాన్ తీర ప్రాంతాన్ని, దీవులను తమ ఆధీనంలోకి తెచ్చుకునే దిశగా వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. వైమానిక దళం, నేవీతోపాటు ఆర్మీతో ముప్పేట దాడులకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పశ్చిమాసియా ప్రాంతానికి భారీ స్థాయిలో బలగాలను తరలిస్తోంది. ఇప్పటికే జపాన్‌లోని ఒకినావా స్థావరం నుంచి యూఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధ నౌక పశ్చిమాసియాకు బయలుదేరింది. నౌక నుంచి బయటికి వచ్చాక నీటిపై ప్రయాణించి, తీరానికి చేరుకున్నాక భూమిపై ప్రయాణిస్తూ దాడులు చేసే ‘యాంఫిబియస్ వాహనాల’తో కూడిన యాంఫిబియస్ రెడీ గ్రూప్ ఆ నౌకలో ఉంది. నౌకలో 2వేల మంది యాంఫిబియస్ సిబ్బందితోపాటు మరో 2,200 మంది మెరైన్ బలగాలు కూడా ఉన్నాయి. ఈ నౌకలపై ఉండే ఎఫ్-35బి, ఏ-10 వార్ట్‌హాగ్స్, హ్యారియర్, సైనికులను, ఆయుధాలను తరలించే ఎంవీ-22 ఓస్ప్రే ఎయిర్‌క్రాఫ్టులు, అపాచీ హెలికాప్టర్లతో పదాతి దళాలకు అవసరమైన సహాయం అందుతుంది. శాన్‌డియాగో నుంచి యూఎస్ఎస్ బాక్సర్ యాంఫిబియస్ అసాల్ట్ షిప్ కూడా 2,200మంది సైనికులతో పశ్చిమాసియా వైపు బయలుదేరినట్టు అమెరికా రక్షణ వర్గాలు వెల్లడించాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్‌కు కీలకమైన ఖెష్మ్ దీవితోపాటు హోర్ముజ్, హెంగమ్, లారక్ ద్వీపాలు ఉన్నాయి. దానికితోడు వందల కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతం జలసంధిలో ప్రయాణించే నౌకలకు అత్యంత సమీపంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ దీవులు, తీర ప్రాంతాల నుంచే నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆ దీవులను, తీర ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్టు రక్షణ వర్గాలు చెబుతున్నాయి. యాంఫిబియస్ నౌకల నుంచి తీర ప్రాంతానికి బలగాలను పంపడం, సైనిక రవాణా హెలికాప్టర్ల ద్వారా కీలక ప్రాంతాలకు సైనికులను చేరవేసి దాడులకు దిగేందుకు రంగం సిద్ధమవుతోందని అంటున్నాయి. పదాతి దళాలకు సాయంగా ఏ-10 వార్ట్‌హాగ్స్, హ్యారియర్ విమానాలు దాడులు చేస్తాయని.. నౌకల నుంచి కూడా సాయం అందుతుందని వివరిస్తున్నాయి. ఇరాన్‌కు ఆయువుపట్టు అయిన ఖార్గ్ దీవిని స్వాధీనం చేసుకునే దిశగా ట్రంప్ యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు రక్షణ శాఖ ఉన్నతాధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం ప్రచురించింది. ఇరాన్ చేసే చమురు ఎగుమతుల్లో 90శాతానికిపైగా ఈ ద్వీపం మీదుగానే జరుగుతుంది. దీనిని స్వాధీనం చేసుకుంటే.. ఇరాన్ ఆర్థిక మూలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని అమెరికా భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఖార్గ్ దీవిలోని ఇరాన్ సైనిక స్థావరాలు, వ్యవస్థలను అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో ధ్వంసం చేశాయి. కొన్నేళ్లుగా ఇరాక్‌లో ఉన్న నాటో బలగాలను అక్కడి నుంచి తరలిస్తున్నారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బలగాలు వెనక్కి వెళ్లిపోతున్నాయని, పరిస్థితులు చక్కబడగానే తిరిగి వస్తాయని ఇరాక్ జాతీయ భద్రత విభాగం ప్రతినిధి సయీద్ అల్ జయషి వెల్లడించారు.

## చమురు, గ్యాస్ డేటా ఇవ్వకుంటే జైలుకే!

**న్యూఢిల్లీ, మార్చి 20: మీడియా టుడే**
పశ్చిమాసియాలో యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో కేంద్రం నిత్యావసర సరుకుల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దీనిప్రకారం ఉత్పత్తి, ప్రాసెసింగ్, రిఫైనింగ్, నిల్వ, రవాణా, దిగుమతి, ఎగుమతి, మార్కెటింగ్, పంపిణీ, వినియోగానికి సంబంధమున్న అన్ని చమురు, గ్యాస్ సంస్థలు.. సంబంధిత డేటాను పెట్రోలియం ప్లానింగ్-అనాలిసిస్ విభాగాని(పీపీఏసీ)కి నిరంతరం తప్పనసరిగా అందజేయాలని స్పష్టంచేసింది. దీనిని ఉల్లంఘిస్తే ఈ చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం నేరపూరిత చర్యగా పరిగణిస్తామని.. జైలు శిక్ష కూడా పడుతుందని హెచ్చరించింది. ఈ సమాచార సేకరణ, క్రోడీకరణ, నిర్వహణ, విశ్లేషణకు పీపీఏసీని నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ వెల్లడించారు. సిటీ గ్యాస్ పంపిణీ (సీజీడీ) కంపెనీల ద్వారా పీఎన్‌జీకి మారాల్సిందిగా వాణిజ్య వంటగ్యాస్ వినియోగదారులను కోరుతున్నట్లు తెలిపారు. నెట్‌వర్క్ ఉన్న చోట్ల అత్యవసర కనెక్షన్లు ఇవ్వడమే గాక రాయితీలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు.



## వాణిజ్య నౌకలపై దాడులు సరికాదు: భారత్

**న్యూఢిల్లీ, మార్చి 20: మీడియా టుడే**
వాణిజ్య నౌకలపై దాడులు చేయడం సరికాదని భారత్ హెచ్చరించింది. నావికా సిబ్బంది ప్రాణాలకు ముప్పు తలపెట్టే చర్యలను మానుకోవాలని స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితికి చెందిన మ్యారిటైమ్ విభాగం అయిన ఇంటర్నేషనల్ మ్యారిటైమ్ ఆర్గనైజేషన్స్ కౌన్సిల్(ఐఎమ్‌వో) 36వ సదస్సు లండన్‌లో జరిగింది. బ్రిటన్‌లో భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి ఈ సదస్సులో పాల్గొని మాట్లాడారు. పశ్చిమాసియా లోని యుద్ధ ఉద్రిక్తతలు సముద్ర వాణిజ్యాన్ని ఘోరంగా దెబ్బతీయడాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com
మీడియా టుడే
హైదరాబాద్, సోమవారం 6 అక్టోబర్ 2025 మన మీడియా - మన సమాజం

శనివారం, మార్చి 21, 2026

# 15 సంవత్సరాల తర్వాత ఖమ్మండీసీసీకి జంబో కమిటీ నియామకం

**- ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీలో 80 మంది దక్కిన స్థానం**

**- టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు - జిల్లా కార్యదర్శిగా రేగురి వాసవి**



**నేలకొండపల్లి మార్చి20 20మీడియా టు డే**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కి పూర్తిస్థాయి కమిటీని నియమించటానికి దాదాపు 15 సంవత్సరాలు పట్టింది. ఇప్పటికైనా జిల్లా కమిటీ నియమిం చటంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గతంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా పనిచేసిన దుర్గాప్రసాద్ జిల్లా కమిటీని నియమించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వెలువచ్చాయి. జిల్లాలో గత 15 సంవత్సరాలుగా జిల్లా కమిటీ అధ్యక్షుడు మినహా. పార్టీలో ఎవరి కి సముఖిత స్థానం ఇచ్చి గౌరవించకపోయినా జిల్లాలో పది సంవత్సరాల బి.ఆర్.ఎస్ పాలనలో కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగానిరసనలు. ధర్నాలు రాస్తారోకోలు చేస్తూ పార్టీని జిల్లాలో కార్యకర్తలు నాయకులు బతికించారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే జిల్లాకమిటీలనునియమిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీకి విస్తృత స్థాయిలో నియామకాలు చేపట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్. ఖమ్మం జిల్లాలో దాదాపు పాత కొత్త నాయకులను కలుపుతూ దాదాపు 80 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఖమ్మం డీసీసీకి కొత్త ఊపు రానుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఉపాధ్యక్షులుగా తుమ్మలూరిలక్ష్మీనరసింహారావు, మలీదు హైమావతి, వేమ్ రెడ్డి సుధాకర్ రెడ్డి, పసుపులేటి దేవేందర్, రంపుడి రోసయ్య, పగడాల మంజుల, బుక్క కృష్ణవేణి, కాపా సుధాకర్, మంకెన శ్రీనివాస్, కెల్లెం వెంకట్ రెడ్డి వంటి పలువురిని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శులుగా వల్లూరి పట్టాభి రెడ్డి, కిలారు అనిల్, మొహమ్మద్ ముస్తాఫా, సి.హుస్సేన్, రెంటాల ప్రసాద్, కంచర్ల వెంకట్ నరసయ్య, పులిబండ్ల చిట్టిబాబు, కొప్పుల గోవిందరావు, కొమ్మినేని రమేష్, కమాటల రేణుక, ప్రభావతి రెడ్డి, దొడ్డ పుల్లయ్య, బానోత్ రామ్మూర్తి, పనిత స్రినివాసరావు, గోవిందు శ్రీనివాస్, నల్లమోతు సునీల్, సిరాజుద్దీన్, పి సోమి రెడ్డి, మామిడి వెంకన్న, మొహమ్మద్ హఫీజ్ ఉద్దీన్, రామసాయం హర్షిత్ రెడ్డి, ధరావత్బాబునియమితులయ్యారు.

**ప్రతినిధులు, కార్యదర్శుల ఎంపిక**

స్పోక్స్‌పర్సన్‌లుగా కల్వకుంట్ల గోపాలరావు, కర్నాటి రామారావు, పమ్మి అశోక్, గంగిశెట్టి ప్రసాద్, బచ్చలకూర నాగరాజులను నియమించారు. కార్యదర్శులుగా బొజేడ్ల సత్యనారాయణ, దామా స్వరూప, కలిమెల బద్రం, గద్యాల జాన్సి రాణి, ముక్రం ఖాన్, దొనబోయిన శేఖర్, బండి మాధవరావు, సాగుర్తి వెంకట్ నారాయణ, మిర్యాల రమణ గుప్త, భుక్య బాలకృష్ణ, పల్లిపాడు కృష్ణ, ఎస్ కె. అబ్దుల్లా, ఎస్ కె. మస్తాన్, తంబాల శామ్యూల్, సత్తు వీరభద్రం, ముదుముత్తాల గంగరాజు, ఫాతిమామహమూద్, లకవత్ అర్జున్, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మారసకట్ల బాబు, భ్రమరెడ్డి, యెర్ర సత్యనారాయణ, వున్నం రాజా శంకర్, చింతమల రవి, రెగురి వాసవి, గొల్లపూడి వీరయ్య, నాగటి చంద్రం తదితరులు చోటు దక్కించుకున్నారు.

**కార్యవర్గ సభ్యుల నియామకం**

కార్యవర్గ సభ్యులుగాసభ్యులుగా ఏసబోయిన శ్రీశ్యామ్, అవెస్ ఖాన్, యన్నం లక్ష్మి, గాథం బాలరాజు, నాయిని సునీత, భుక్య నాయక్, పాటి నర్సయ్య, కొట్టయ రాజశేఖర్, ఆరెం రవి, శ్రీలత, కేత్యపల్లి బాస్కరరావు, అయ్యకట్ల గురువయ్య, నర్రా బద్రకాళి, బానోత్ వినోద తదితరులను ఎంపిక చేశారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తలంతా సమిష్టిగా పని చేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా నిలబెట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కొత్తగా నియమితులైన నాయకులు ప్రజా సమస్యలపై చురుకుగా స్పందించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

# ముస్లిం సోదరుల సంక్షేమమే లక్ష్యం కీతవారిగూడెంలో తోఫాలు, దుస్తుల పంపిణీ

**( మీడియా టుడే గరిడేపల్లి మార్చి 20)**

గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు, సోదరీమణుల సంక్షేమం కోసం తోఫాలు, చీరలు, లాల్చీపైజామాల పంపిణీ కార్యక్రమం ఘనంగ5 నిర్వహించబడింది. ఈ కార్యక్రమం గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు మంత్రివర్యులు కెప్టెన్ నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగింది.ముస్లిం సోదరులు, సోదరీమణులు ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఎస్కే చాందిమియా మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు, సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఉత్తమ్




కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంతో ఈ కార్యక్రమం విజయవంతమైందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు అధ్యక్షులు మస్తాన్ , ప్రధాన కార్యదర్శి ఖాసిం గారు, వార్డు మెంబర్ సఫియా మీరా గారు, సైదా ఉసేను, మదర్ సాబు, ముస్తఫా, నాగుల మీర, సైదా తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఐటిడిఏ పీఓ బి. రాహుల్

**భద్రాచలం,మార్చి20(మీడియా టుడే):**



ఏజెన్సీ ఏరియాలోని ఆదివాసి గిరిజన కుటుంబాలకు, గిరిజన విద్యార్థిని విద్యార్థులకు సేవలందిస్తున్న వివిధ కార్యాలయాలతో పాటు ఐటిడిఏ కార్యాలయంలో పనిచేస్తున్న ముస్లిం అధికారులు, సిబ్బందికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.రంజాన్ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు ముస్లిం కుటుంబాలు కఠిన ఉపవాసాలు పాటిస్తూ ఆచరించే పిత్రా, జకాత్ వంటి నియమాలు పేదవారి ఆకలి, కష్టాలను గుర్తు చేస్తాయని అన్నారు. తన సంపాదనలో కొంత భాగాన్ని పేదల ఆకలి తీర్చేందుకు కేటాయించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ మానవాళికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన శాంతి మార్గంలో నడుచుకుని సమాజంలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మరోసారి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# వాసవి దేవాలయంలో పారాయణం

**మహిళలకు లక్కీ డిప్ ద్వారా చీరల బహుమతి - ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమంగా కొనసాగింపు**



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 20**

కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శు క్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.పారాయణం అనంతరం నిర్వహించిన లక్కీ డిప్ కార్యక్రమంలో కల్వకుర్తి అవోప ట్రెజరర్ కల్వ ఆంజనేయులు చేతుల మీదుగా లక్కీ డిప్ లో గెలుపొందిన మారం సునీతకు అమ్మవారి చీరను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమం భక్తులలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో దేవాలయ పూజారి లక్ష్మీనారాయణ, కల్వకుర్తి మహిళా సంఘం అధ్యక్షురాలు గోవింద్ మౌనిక, వాసవి పారాయణం బృందం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి శుక్రవారం పారాయణానికి హాజరయ్యే మహిళలకు లక్కీ డిప్ ద్వారా ఒకరికి అమ్మవారి చీరను బహుమతిగా అందజేస్తున్నామని దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు తెలిపారు.

# రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు నూతన విశ్రాంతి గది ప్రారంభం

**-సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 20**

కరీంనగర్ పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ లో పోలీస్ సిబ్బంది సంక్షేమం మరియు పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శు క్రవారంనాడు నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు.?ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అన్ని పోలీస్ స్టేషన్ లోమౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో మరియు ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుగ్గా, సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తో పాటు ఎస్సై లు నరేష్,లక్ష్మా రెడ్డి లతో పాటు ఇతర పోలీసు అధికారులు మరియు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామ శోభాయాత్రకి గౌరవ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కి ఆహ్వానం అందజేసిన హిందూ వాహిని సభ్యులు

**హిందు వాహిని ఆధ్వర్యంలో శ్రీరామనవమి నాడు నిర్వహించే శ్రీరామ శోభాయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంకర్ గారు పిలుపునిచ్చారు**



**మీడియా టుడే షాద్ నగర్ మార్చి 20**

ఈనెల 27 శ్రీరామనవమి నాడు షాద్నగర్లో నిర్వహించబోయే శ్రీరామ శోభాయాత్ర కార్యక్ర మానికి గౌరవ షాద్నగర్ ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ గారిని, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వామప్ప గారిని అలాగే వార్డు కౌన్సిలర్లు సంతోషి భాయి చందులాల్ గారిని, రాజు నాయక్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శోభాయాత్రకు ఆహ్వానం అందజేసిన హిందూ వాహిని సభ్యులు చెట్ల వెంకటేష్ ,క్యామ మహేష్, సల్లా మహేష్, చింతకుంట రాఘవేందర్, కమలాజి శ్రీనివాస్ చారి, గుండు అశోక్, గంధ్రాతీ శివశంకర్, మంగా విజయ్, పసులోటి శ్రావణ్, గుడాల రమేష్, అల్లాడి శ్రీను, మ్యాడమోని మధు, రామకృష్ణ, దేవేందర్, అశోక్, తరుణ్, శ్రీకాంత్, మరియు హిందు వాహినీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# కొత్త సబ్ స్టేషన్ కొరకుస్థల పరిశీలన

**ఎస్ ఇ శ్రీనివాస్, సర్పంచ్ రామంజిగౌడ్**



**(గరిడేపల్లి మీడియా టుడే మార్చ్ 20 )**

మండలంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్నలో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి పారదర్శకమైన అడుగు పడింది. సూర్యాపేట ఎస్ ఇ,శ్రీనివాస్ శుక్రవారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో ప్రతిపాదిత సబ్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.మండలంలోని రాయినిగూడెం ముత్యాల నగర్ కాల్వపల్లి, సర్వారం, కాచవారిగూడెం లింగగిరి గ్రామాల్లో తీవ్రంగా ఉన్న లో వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయినిగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చి, రైతులు, గృహ వినియోగదారులకు పెద్ద ఊరట లభించనుంది.ఆయన వెంట సర్పంచ్ గుండు రామాంజిగౌడ్, ఏఈ గన్న సాయి కృష్ణ, పంచాయతీ సెక్రటరీ సునీత, ఏఎల్ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మార్చి20(మీడియా టుడే):**




ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ రంజాన్ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు.ముస్లిం సోదరులు ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులతో కలిసి అనందంగా జరుపుకోవాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు .రంజాన్ మాసంలో ముస్లీం సోదరులు చేసిన కఠిన ఉపవాస దీక్షలను ఈద్-ఉల్-ఫితర్ పండుగతో ముగిస్తారని అన్నారు.ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదర భావాన్ని కలిగియుండి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని కోరారు.

# హైందవ శక్తి తెలుగు నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ




**మణుగూరు,మార్చి20(మీడియా టుడే):**

మణుగూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో "శ్రీ పరాభవ" నామ సంవత్సరం చైత్రమాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని "హైందవ శక్తి" తెలుగు నామ సంవత్సర క్యాలెండర్‌ను డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ డిఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి తెలుగు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మణుగూరు సిఐ పాటి నాగబాబు కు క్యాలెండర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెణ్ణం శ్రీకాంత్, దేవర్ల దేవేందర్, బొజ్జా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఓ సిఅందజేసిన ఎమ్మెల్యే



**జగిత్యాల రూరల్- మీడియా టుడే-మార్చు 20**

జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగపురి సురేష్ గుండె సంబంధిత వ్యాధితో నిమ్స్ హాస్పిటల్ లో ఉండగా గ్రామ నాయకులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారి దృష్టికి తీసుకురాగా వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి ఈరోజు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గారు వెంట రాయికల్ మాజీ ఎంపీపీ సంధ్యరాణి సురేందర్ నాయక్ ఉన్నారు

## మోటర్ ట్రాన్స్పోర్ట్ విభాగానికి చెందిన పాత టైర్లు, బ్యాటరీలు, ఇనుప విడి భాగాల వేలం నిర్వహణ



**నల్లగొండ, మార్చి 20 (మీడియా టుడే)**

జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్పోర్ట్ విభాగానికి చెందిన, కాలం చెల్లిన పోలీస్ వాహనాల పాత టైర్లు, బ్యాటరీలు, ఆయిల్ డ్రమ్స్, ఇతర ఇనుప విడి భాగాలపై వేలం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ వేలం కార్యక్రమం 25వ తారీఖు బుధవారం ఉదయం పది గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించబడుతుంది. వేలంలో పోలీస్ వాహనాలకు సంబంధించిన వివిధ రకాల పాత టైర్లు, ఆయిల్, పాత బ్యాటరీలు, స్పేర్ పార్ట్స్ తదితర వస్తువులు అందుబాటులో ఉంటాయి. వేలంలో పాల్గొనదలచిన వారు పేర్కొన్న తేదీన ఉదయం పది గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయానికి హాజరై వేలంలో పాల్గొనగలరు.

## సదాశివపురం గ్రామపంచాయతీ సర్పంచ్ పాలపాటి సురేష్ దంపతులకు ఘన సన్మానం

**తెలంగాణ ఉద్యమకారుడు మాల మహానాడు**

**ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు సల్లూరి దేవ సహాయం**



**నేలకొండపల్లి మార్చ్ 20 మీడియట్ టుడే**

నెలకొండపల్లి మండల పరిధిలోని సదాశివపురం గ్రామపంచాయతీ సర్పంచ్ గా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన పాలపాటి సురేష్ దంపతులను. తెలంగాణ ఉద్యమకారుడు. ఖమ్మం జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడు. గతంలో సదాశివపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసినసల్లూరి దేవ సహాయం శుక్రవారం శాలువాకప్పి స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదాశివపురం గ్రామాన్ని అన్ని విధాలుగాఅభివృద్ధి చేసి మంచి పేరు సంపాదించుకోవాలని చెప్పారు.ఇక్కడ ఉన్న రెండు కులాల వారిని సమ దృష్టితో చూడాలని దేవ సహాయం కోరారు. వివాదాలకు తావు లేకుండా మంచి పరిపాలన అందించి ప్రజల దృష్టిలో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని. అందుకు అధికారుల ప్రజాప్రతినిధుల గ్రామపంచాయతీ పాలకవర్గం. తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్.సురేష్ సతీమణిపాలపాటి ఉమా. ఇందిరమ్మ కమిటీ సభ్యుడు. దుంపల సుధాకర్. పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్ దుంపల ప్రమీల. నాయకులు నాగేల్లి సైదులు. నోసిన లక్ష్మయ్య. పాలపాటి రమేష్. దుంపల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫాను అందజేసిన సర్పంచ్ పాలకి సురేష్



**కోదాడ, మార్చి 20 (మీడియా టుడే)-:**

మండల పరిధిలోని దోరకుంట గ్రామంలో మసీదు నందు రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు అందిస్తున్న రంజాన్ తౌఫాను ముస్లిం కుటుంబాలకు సర్పంచ్ పాలకి సురేష్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముస్లిం సోదరీ సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. రంజాన్ పర్వదినాన్ని ముస్లింలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణం లో జరుపుకోవాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ అమీనా, ఖయ్యూం, పాలడుగు జాన్, కాంగ్రెస్ నాయకులు పత్తిపాక వెంకటేశ్వర్లు, జక్కుల నరసింహారావు, పత్తిపాక రాంబాబు, ఒగ్గు నాగేంద్రబాబు, సుంకర మల్లేశ్వరరావు, షేక్ అహ్మద్, డ్రైవర్ జబ్బర్, ఇమాం, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

### బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

# " నీటి దినోత్సవం వేడుకలు "





**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 20 :**

బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కందుగుల గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని హుజురాబాద్ ఏరియా ఇంచార్జ్ పిలుపు మేరకు కందుగుల జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నీటి దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని నీటి నిల్వలను పెంచుకోవాలని నీటిని వృధా చేయకూడదని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పు మహేష్, ఉప సర్పంచ్ మండ సతీష్, వార్డు సభ్యులు అరణ్య విజయ్ గ్రామ పెద్దలు మోద్దల సాంబయ్య , స్కూల్ హెచ్ఎం సంజీవరెడ్డి , ఇన్చార్జి మేడం ఏ మమత, స్కూల్ యాజమాన్యం మరియు బాలవికాస కోఆర్డినేటర్స్ రజిత హైమావతి కళ్యాణి మరియు మహిళలు స్కూల్ పిల్లలు నజీమా మొదలగు వారు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని అలాగే గ్రామంలో ఎక్కడైనా నీటి సరఫరాకు సంబంధించి లీకేజీ ఉంటే వాటిని సరిచేస్తామని , నీటి నిల్వలను పెంచే కార్యక్రమాలను చేపడతానని , ప్రతి ఇల్లు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. స్కూల్ యాజమాన్యం , బాలవికాస సంస్థ చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని అలాగే ఒక్క రూపాయికే వాటర్ ఇస్తూ ఎంతోమంది నిరుపేదలకు సహాయం చేస్తున్నారని , వారు చేసే పలు సేవా కార్యక్రమాలు బాగున్నాయని , అన్ని సేవా సంస్థల లో బాలవికాస సంస్థ చాలా పెద్దదని కొనియాడారు.

# బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట

### - రాష్ట్ర బడ్జెట్ పై ఎమ్మెల్యే కవ్వంపల్లి వ్యాఖ్య



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 20 :**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ లో ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేశారని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వ్యాఖ్యానించారు.ఈ బడ్జెట్ లో వ్యవసాయం, విద్య,విద్యుత్, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ రంగం అభివృద్ధి కోసం రూ.26,674 కోట్లు కేటాయించడం సహేతుకమన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయరంగం అభివృద్ధి కోసం ఆ శాఖకు రూ.23,179 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలించిందన్నారు. అలాగే మరో కీలకమైన విద్యుత్ శాఖకు రూ. 21,285 కోట్లు కేటాయించడం శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు.బీసీ సంక్షేమానికి రూ.12,511 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,934 కోట్లు , మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉదాతరతను చాటుకున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించారని, అందుకే ఈ బడ్జెట్ సబ్బండవర్ణాల సంక్షేమ బడ్జెట్ గా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, రూ. 50,713 కోట్లు కేటాయించడం ద్వారా వీటి అమలుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం పటాపంచలు చేసినట్టయిందని ఆయన ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే నిర్దేశించుకున్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరిగినట్టుగా విదితమవుతోందని ఆయన పేర్కొన్నారు. మంచి బడ్జెట్ రూపకల్పన చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని, బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను డాక్టర్ కవ్వంపల్లి అభినందించారు.

### ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసిన

# టిబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు



**భద్రాచలం,మార్చి20(మీడియా టుడే):**

భద్రాచలం పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మణుగూరు ఏరియా టిబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు శుక్రవారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఏరియాలో స్థానిక సమస్యలు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు సంబంధించిన కన్వేయర్ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, సర్ఫేస్, అండర్ గ్రౌండ్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్, హెల్పర్, కేబుల్ మెన్, అసిస్టెంట్ చైన్ మెన్, చైన్ మెన్, ఈపీజీహెచ్, జనరల్ అసిస్టెంట్ హెచ్ఈఎం, ఎం కేటగిరీలలో సుమారు 132 బ్యాక్‌లాగ్ పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అర్హత గల కార్మికులు ఏరియాలోనే పనిచేస్తున్నందున, ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఈ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.సింగరేణి వ్యాప్తంగా రీజియన్‌ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మారుపేర్ల సమస్యతో విజిలెన్స్ కేసులు పరిష్కారం కాక అనేక ఏళ్లుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్న కార్మిక కుటుంబాల సమస్యలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పరిష్కరించాలని కోరారు. అలాగే కార్మికులపై పెండింగ్‌లో ఉన్న చార్జ్‌షీట్లను ఎత్తివేయాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో బ్రాంచి నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, పి.కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి

**అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్‌రెడ్డిని లాగొద్దు**

**తండ్రి పేరనున్న భూమిని కాజేసేందుకు యత్నం- మీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు**




**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్ధన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ తీర్థాల రెవెన్యూలోని760 సర్వే నెంబర్‌లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు వట్నట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రఫుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్‌లో పేర్కొందనితెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగారిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని,క్యాంప్ ఆఫీస్ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డిని లాగుతున్నారని, ఇది సరి కాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్‌రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్‌తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.తమ సమస్యను తామే పరిష్కరించకుంటామన్నారు. దీనికి రాజకీయం పూయవద్దని సూచించారు.

# కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**కోదాడ, మార్చి 20 (మీడియా టుడే)-:**

కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ నూతన కమిటీని శుక్రవారం కోర్ కమిటీ చైర్మన్ రెవ డాక్టర్.కె శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. నియోజకవర్గ అధ్యక్షుడిగా కె రామారావు.గౌరవ అధ్యక్షులుగా యేసురత్నం, వైస్ ప్రెసిడెంట్ ,దేవిద్రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ,రమేష్ ,సెక్రటరీగా కోర్నేలిబాబు, జాయింట్ సెక్రెటరీ దానియేలు ,ట్రెజరర్. పాల్ చారి చీఫ్ -కో -ఆర్డినేటర్ ఇస్మాయేల్,ఏకగ్రీవంగా ఏర్పాటు చేయబడినారు.క్రమశిక్షణ కమిటీ చైర్మన్గా రెవరెండ్ డాక్టర్.వి.యేసయ్య, వైస్ చైర్మన్గా శాంత వర్ధన్, ఇర్మియా లు ఏర్పాటు చేయబడినారు. కోదాడ పట్టణ కమిటీ అధ్యక్షుడుగా రెవరెండ్ సైమన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రభుదాస్, గౌరవ అధ్యక్షులుగా జోసఫ్ రాజు, వైస్ ప్రెసిడెంట్.గుండు దానియేల్, సెక్రటరీ జి.ఆమోస్, ట్రెజరర్. నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూత్ కమిటీ ప్రెసిడెంట్ గా కె. సురేష్ , ఉపాధ్యక్షులుగా. నిస్సి , సెక్రటరీ ప్రియదర్శన్, ట్రెజరర్ కే ఎనోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ క్రైస్తవ నాయకులు బిషప్. శామ్యూల్, డాకూరి ప్రభుదాస్ పరంజ్యోతి గుడిబండ ఏసయ్య లాజర్, సిల్వరాజు, గబ్రీల్ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత నామ

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**




ఖమ్మం : బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ రంజాన్ నెలకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు. రంజాన్ మాసం త్యాగం, నియమం, సేవా భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు పాటిస్తూ ఈ పవిత్ర మాసం మనిషిలో సహనం, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ సంక్షేమం కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి, ముస్లిం సోదరుల అభివృద్ధి కోసం కట్టుబడి పని చేశారని ఈ సందర్భంగా నామ తెలియజేశారు. ముఖ్యంగా ముస్లిం సమాజం ఆర్థికంగా, విద్యా పరంగా వృద్ధి సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించినట్లు, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించినట్లు వివరించారు. అలాగే మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యా సహాయం, వృత్తి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. డ్రైవర్ ఎంపవర్మెంట్ (ఓనర్ కమ్ డ్రైవర్) పథకం కింద సబ్సిడీతో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా యువతకు కార్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా తాను ఎంపీ గా గెలిచిన రెండు సార్లు కూడా 15వ, 17వ లోక్ సభల్లో మైనార్టీల సమస్యలు పైన మాట్లాడటం తో ముస్లిం రిజర్వేషన్స్ విషయమై నాటి కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన తీర్మానం ఆమోదించాలని పార్లమెంట్ సాక్షిగా పోరాటం చేసానని నామ గుర్తు చేసారు. నాటి బీఆర్ఎస్ పాలన లో మసీదుల అభివృద్ధి, దర్గాల సంరక్షణ, హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారని నామ పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణుల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నామ తెల్పడంతో పాటు రంజాన్ పర్వదినం ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, శాంతి, సంపద, శుభ ఫలితాలు నింపాలని నామ ఆకాంక్షించారు.

# బట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజల బడ్జెట్

**ప్రతికుటుంబానికిభరోసా సంక్షేమానికి పెద్దపీట.**

**పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు - జెర్రి పోతుల సత్యనారాయణ**



**నేలకొండపల్లి మార్చి 20 మీడియా టుడే**

ఈరోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజల బడ్జెట్ గా పాలేరు నియోజకవర్గకాంగ్రెస్‌పార్టీ బిబ్లాక్‌అధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ అభివర్ణించారు. శుక్రవారం నేలకొండపల్లిలో ఆయన మీడియా టుడే ప్రతినిధితో మాట్లాడుతూ. ప్రతి కుటుంబానికి భరోసాసంక్షేమానికి పెద్ద పెద్దపీట. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అని సత్యనారాయణకొనియాడారు.ఈ బడ్జెట్లో ఆరోగ్యం విద్యసంక్షేమ రంగాని కి పెద్దపీటవేయడం శుభసూచక మన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయి ంచడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శన మన్నారు. వ్యవసాయానికి 23,179 కోట్లు , విద్యారంగానికి దాదాపు 26 వేల కోట్లు సాగునీటి రంగానికి 22615 పంచాయతీరాజ్ శాఖకు 33 వేల కోట్లు.మెట్రో రైల్ కారిడార్ల విస్తరణకు 24 వేల కోట్లు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేయడం.దేశ చరిత్రలోనే తొలిసారని సత్యనారాయణ చెప్పారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపుదిద్దుకున్న ఈ బడ్జెట్ తెలంగాణను ప్రగతి పథంలో తీసుకెళుతుందని. ప్రజల ఆరోగ్యం జీవిత బీమాకు పెద్దపీట వేసిందని.ఆరోగ్యశాఖకు 13 679 కోట్లు కేటాయించి కోటి 15 లక్షల కుటుంబాలకు బీమా భరోసా కల్పిస్తూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు.దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. ఇలాంటి మహత్తరమైన పథకం ఏ రాష్ట్రంలోనూ లేదఅఓ.ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రకటించడం విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి కి నిదర్శన మన్నారు.రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ ను రూపొందించి నూతన ఒరవడితో ముందుకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు.

# బాలల సదనంలో సంరక్షణ, ఆరోగ్య సేవలు సమగ్రంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**పిల్లలకు మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన పోషకాహారం అందించాలి.**

**స్థానిక బాల సదనంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం ప్రభుత్వ లక్ష్యమని, మంచి ఆరోగ్యం ఉన్నప్పుడే పిల్లలు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.శుక్రవారం నగరంలోని ఎన్.ఎస్.పి. రోడ్‌లోని బాలల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలలో తిరుగుతూ పరిశుభ్రత, మౌలిక వసతులు, పడక గదులు, బాత్‌రూములు, త్రాగునీటి సదుపాయం, వంటగది నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. వంటగదిలో తయారవుతున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా చూసి, పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, భోజనం కామన్ మెనూ ప్రకారం సరైన ప్రమాణాలతో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అన్నం, కూరలు, పప్పు, సాంబారు, గుడ్లు, చికెన్ వంటి పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.పిల్లలతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్, భోజనం రుచిగా ఉందా, సమయానికి అందిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల అభిప్రాయాలను వినడం ద్వారా సేవల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న చంటి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్, చంటి పిల్లలపై నిరంతర వైద్య పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి చిన్నారి ఆరోగ్యం, పోషణ, భద్రతపై సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. దత్తత ప్రక్రియలో పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారి వివరాలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, చట్ట పరమైన విధానాలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

బాలల సదనాల్లో ఉన్న పిల్లలు మన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారికి అందించే ఆహారం పోషక విలువలతో కూడినదిగా, రుచికరంగా ఉండాలని అన్నారు. పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, భద్రత అంశాల్లో ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాలల సదనాల్లో ఉన్న ప్రతి చిన్నారి భవిష్యత్తు అమూల్యమైన సంపద అని వారి ఆరోగ్యం, పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం సిబ్బంది ముఖ్య బాధ్యతగా వ్యవరించాలని తెలిపారు. పిల్లలకు అందించే ఆహారం పోషక విలువలు సమృద్ధిగా ఉండేలా ప్రణాళికా బద్ధంగా ఉండాలని, సమయానికి వైద్య పరీక్షలు అందేలాగా చర్యలు చేపట్టాలని అన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన సేవలు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు.దత్తత ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చట్టపరమైన విధానాల ప్రకారం పిల్లలను దత్తత ఇవ్వాలని, ప్రతి దశలో బాలల హితం ప్రాధాన్యంగా ఉండే విధంగ బాలల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో ఉచిత మెగా వైద్య శిబిరం

**పేదలకు కార్పొరేట్ వైద్యం**

**కోదాడలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన**



**కోదాడ, మార్చి 20 (మీడియా టుడే)-:**

కోదాడ స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పబ్లిక్ క్లబ్ నందు శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వర్గీయ పైడిమర్రి జానకి గారి జ్ఞాపకార్థం, నిర్వాహకులు కోదాడ మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు మార్గదర్శకత్వంలో, హైదరాబాద్ యశోద హాస్పిటల్ (మలక్ పేట) సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.సుమారు 4,000 రూపాయల విలువైన జుజు+ మరియు 2జ జుజునూ పరీక్షలను రోగులకు ఉచితంగా నిర్వహించారు. కార్డియాలజీ, డయాబెటిక్ మరియు ఆర్థో స్క్రీనింగ్ విభాగాలకు చెందిన నిపుణులు 500 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా పైడిమర్రి సత్తిబాబు మాట్లాడుతూ, సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే మెగా హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ప్రవీణ, రాజశేఖర్, ఒరుగంటి కిట్టు, ఉపాధ్యక్షులు సుధాకర్, పైడిమర్రి వెంకటనారాయణ, వ్యవస్థాపకులు గాదంశెట్టి శ్రీను, పైడిమర్రి నారాయణరావు, కొత్తూరు శ్రీనివాసరావు, మేళ్లచెరువు కిషోర్, ఇమ్మడి రమేష్, శంకర్ రావు,హనుమంతరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కిట్స్ సివిల్ విద్యార్థినికి గేట్ (గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ జాతీయ స్థాయి పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్



**కోదాడ, మార్చి 20 (మీడియా టుడే)-:**

స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అప్పన్న ఉషారాణి విద్యార్థినికి 2026వ సంవత్సరం ప్రకటించిన ఫలితాలలో ఆలిండియా గేట్ ( జాతీయ స్థాయి పరీక్ష) లో 7106 ర్యాంక్ సాధించడం జరిగింది. ఈ ర్యాంక్ ద్వారా జాతీయ స్థాయి లో ప్రతిష్ఠాత్మ కమైన విద్యా సంస్థలు అయినటువంటి ఐఐటీ, ఎన్ఐటి వంటి విద్యాసంస్థలో ఎంటెక్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ ) విద్య పూర్తి చేయుటకు అర్హత సాధించినట్లుకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళ పల్లి గాంధీ తెలిపారు.ఈ జాతీయ స్థాయి పరీక్ష అయిన గేట్ లో ర్యాంక్ సాధించిన విద్యార్థిని ని కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ ,కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెరుమాళ్ళ పల్లి గాంధీ, కళాశాల డైరెక్టర్ నాగార్జునరావు గారు మరియు విభాగాధిపతి లక్ష్మణ్ సివిల్ అధ్యాపక సిబ్బంది, అభినందించారు.

# అక్రమంగా నిల్వ చేసిన 39 ఎల్ పిజి సిలిండర్లు స్వాధీనం

**6 ఎ కేసులు నమోదు**



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : జిల్లా సివిల్ సప్లయ్ అధికారి (డి సీ ఎస్ఓ) సిబ్బందితో కలిసి అక్రమ ఎల్ పి జి సిలిండర్ల నిల్వపై మూడు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 39 ఎల్ పి జి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి అక్రమ నిల్వకు పాల్పడిన వారీపై 6 ఎ కేసులు నమోదు చేయబడ్డాయి.1. రఘునాథపాలెం మీసేవా కేంద్రంలో తనిఖీ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన 32 ఎల్ పి జి సిలిండర్లు స్వాధీనం చేసుకోబడ్డాయి. మీసేవా ఆపరేటర్ అయిన జంగాల దుర్గారావు మీద అవశ్యక వస్తువుల చట్టం(ఈసీ ఏసీటీ)కింద 6 ఎ కేసు నమోదు చేయబడింది.2. ఖమ్మం ఎన్ టి ఆర్ సర్కిల్‌లో భవాని బిర్యాని హోటల్‌లో నిర్వహించిన తనిఖీలో వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న 3 గృహ వినియోగ సిలిండర్లను ఉపయోగించిన నేరానికి 6 ఎ కేసు నమోదు చేయబడింది.3. రఘునాథపాలెంలోని సితారా హోటల్‌లో తనిఖీ జరిపి అక్రమంగా నిల్వ చేసిన 4 ఎల్ పి జి సిలిండర్లు స్వాధీనం చేసుకోబడ్డాయి. హోటల్ నిర్వాహకుడిపై 6 ఎ కేసు నమోదు చేయబడింది.ఎల్పి జి వినియోగదారులకు తెలియజేయవలసినదేమిటంటే, గృహ అవసరాల కొరకు మాత్రమే సరఫరా అయ్యే ఎల్ పి జి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుకోవడం చట్టవిరుద్ధం. అలాంటి అక్రమ కార్యకలాపాలను గమనించిన వారు వెంటనే డి సి ఎస్ ఓ కార్యాలయానికి సమాచారం అందించవలసిందిగా కోరుతున్నామన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి డిజైన్లు సిద్ధం చేయాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-తెలంగాణ పబ్లిక్ స్కూల్ లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్.**





**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
జిల్లా పరిధిలో ఎంపిక చేసిన 9 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా అభివృద్ధి చేసేందుకు డిజైన్స్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

9 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా 1000, 800 మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులను, మౌళిక వసతులు కల్పించేలా ప్రణాళిక చేయాలన్నారు. 9 పాఠశాలల లే ఔట్ లను పరిశీలించి జి౦1 పద్దతిలో అదనపు తరగతి గదులు, ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, సంప్, కిచెన్, వాష్ రూమ్, ఇతర మౌళిక వసతుల కల్పనకు ప్లాన్ ను సిద్ధం చేయాలన్నారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి కోసం నిధులు నాబార్డ్ నుంచి వస్తాయని, నాబార్డ్ గైడ్ లైన్స్ కు అనుగుణంగా పాఠశాలలను అభివృద్ధి చేయాలని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ డిజైన్, ఉపయోగించే సామాగ్రి మంచి క్వాలిటీతో ఉండాలని, డిప్యూటీ సీఎం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగాతీసుకుంటున్నారని,ఈఅంశాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. పబ్లిక్ స్కూల్స్ లో ఎంట్రీ గేట్, పార్కింగ్ ఏరియా, వివిధ భవనాలకు వెళ్లేందుకు మార్గాలు, ల్యాండ్ స్కేపింగ్, ప్రీ స్కూల్ బ్లాక్, గ్రౌండ్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ వంటి వివిధ అభివృద్ధి పనులతో కూడిన డిజైన్లు ప్రతి పాఠశాలకు రెండు నుంచి 3 వరకు అందించాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ డిజైన్ మాదిరిగా పబ్లిక్ స్కూల్స్ కు కామన్ డిజైన్ తయారు చేయాలని, ప్రతి పాఠశాలకు క్షేత్రస్థాయిలో అవసరమైన మేర చిన్న, చిన్న మార్పులు చేసుకునే ఆస్కారం ఉంటుందని, ప్రతి తరగతి గదిలో మంచి వెలుతురు, గాలి వచ్చే విధంగా డిజైన్ చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత మండలంకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా చూడాలని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 9 పబ్లిక్ స్కూల్స్ ను తహసిల్దార్ పరిశీలించి అవసరమైన ల్యాండ్ సర్వే చేయించి, అందుబాటులో ఉన్న పాఠశాల భూమి సరిహద్దులు ఫిక్స్ చేయాలని కలెక్టర్ సూచించారు.

**అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ**

జిల్లా పరిధిలో గుర్తించిన 9 పాఠశాలకు స్పోర్ట్స్ గ్రౌండ్, టాయిలెట్స్, అదనపు తరగతి గదులు, ప్రీ ప్రైమరీ సెక్షన్ వంటి వసతులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 9 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ సంబంధించి అభివృద్ధి పనుల కోసం స్కెచ్ లేఔట్ ప్లాన్స్ ఫైనల్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.అనంతరం ఆర్కిటెక్చర్ రూపొందించిన పలు ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించి తుది డిజైన్ తయారి కోసం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్లు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఈఈ మహేష్ బాబు, తహాసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐడిబిఐ కార్పొరేట్ అధికారుల రేకుర్తి కంటి ఆసుపత్రి సందర్శన





**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 20 :**
శుక్రవారం ఉదయం ఐడిబిఐ కార్పొరేట్ అధికారులు సి జి ఎం జానకిరామన్ , డి జి ఎం వెంకటేశ్ ,మేనేజర్ శ్రీనివాస్ , శ్రీధర్ కోలిపాక మరియు మరికొంతమంది అధికారులు కరీంనగర్ పట్టణంలోని రేకుర్తి కంటి వైద్యశాలను సందర్శించారు. ఈ మధ్యకాలంలో ఐడిబిఐ నుండి 70,20,800 సి ఎస్ ఆర్ గ్రాంట్ క్రింద మాడ్యులర్ థియేటర్స్ కన్స్ట్రక్షన్ కు మరియు పేషంట్స్ ట్రాన్స్పోర్టేషన్ గాను బస్సు గురించి దానం చేయడం జరిగింది, వారిచ్చిన డబ్బును ఖర్చుపెట్టిన విధానం పరిశీలించడం జరిగింది. అనంతరం వారిచ్చిన డబ్బు ద్వారా నిర్మించిన ఆపరేషన్ థియేటర్స్ ప్రారంభం చేశారు. చైర్మన్ కొండ వేణు మూర్తి మాట్లాడుతూ లాసిక్ మిషన్ సుమారుగా 4కోట్ల సహాయం అందించవలసిందిగా కోరారు, . శ్రీ జానకి రామన్ చీఫ్ జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిశీలిస్తామని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో చిదుర సురేశ్, ప్రకాశ్ హొల్లా , ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, ముక్క శరత్ కృష్ణ, మ్యాడమ్ శివకాంత్ మరియు సింగంరాజు, ప్రవీణ్ చావ్లా, తదితరులు పాల్గొన్నారు .

# గాలిపల్లి లో కేసవేణి ఎల్లయ్య ఎద్దు పిడుగు పడి మృతి

**గత 11 నెలల క్రితం రైతును ఆదుకున్న శ్రీకృష్ణ గోశాల ట్రస్ట్ సభ్యులు**



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 20** : సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలో గత సంవత్సరం ఏప్రిల్ నెలలో ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామానికి చెందిన కేశవేని ఎల్లయ్య అనే రైతుకు చెందిన ఎద్దు పొలం పని చేస్తుండగా ఒక్కసారిగా అకస్మాత్తుగా మృత్యువాత పడింది. దీంతో పొలంలో కన్నీరు మున్నీరుగా విలపించిన రైతు కేశవేణి ఎల్లయ్య, గత సంవత్సరం ఎల్లయ్య ఫోటో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యింది. ఆ హృదయ విదారక సంఘటన చూసిన శ్రీకృష్ణ గోశాల ఇల్లంతకుంట ట్రస్ట్ వారు ఒక్కసారిగా చలించి పోయి సదరు రైతుకు, ట్రస్ట్ లోని కోడె ల్యాగే ను అందించి ఓదార్చారు . శుక్రవారం రోజు తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండగా పిడుగు పడి మరో ఎద్దు మరణించడం తో కన్నీరు మున్నీరై ఏడుస్తున్న ఎల్లయ్య , నాపై రాష్ట్ర ప్రభుత్వం కనికరించి నన్ను ఆదుకోవాలని కేశవేణి ఎల్లయ్య ప్రభుత్వ అధికారులను వేడుకున్నాడు.

# దాసరి రవీందర్ జయంతి వేడుకలు



**రాయికల్-మీడియా టుడే-మార్చి 20:**
రాయికల్ పట్టణంలో సీనియర్ జర్నలిస్టు స్వర్గీయ దాసరి రవీందర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద గల ఆయన విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు దాసరి గంగాధర్, దాసరి సత్తమ్మ, దాసరి సరిత, సహర్ష్, శృతి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, భోగ రవి ప్రసాద్, డాక్టర్ మోర సుమన్, డాక్టర్ రోజ, డాక్టర్ శ్రీలత, మోర రామ్మూర్తి, గన్నె రాజిరెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, మాజీ కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్, కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్, పాత్రికేయులు నాగమల్ల శ్రీకర్, గంగాధరీ సురేష్, రసూల్, తీగుళ్ల గోపి, గట్టుపెల్లి నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ మార్చ్ 20:**
శిల్పారామం మాదాపూర్ లో నిర్వహిస్తున్న “గాంధీ శిల్ప బజార్” హస్తకళా ఎక్సహిబిషన్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి మరియు కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. రజిని మై నళిని మై శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, వినాయక కౌతం, మండూక శబ్దం, అదిగో అల్లదిగో, నటేశ కౌతం, ఆనంద తాండవం, తిల్లాన, జయ జనార్ధన మొదలైన అంశాలను శ్రీ సాయి శ్రేష్ఠ, , అద్విక, అధ్య, అన్విక, నందిత, కుసుమ, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. కథక్ నృత్య ప్రదర్శనలో సంజుక్త ఘోష్ శిష్య బృందం శంకర అతిప్రచండ, తరన, జప్తాల్, పాయలియా, అభినయ మొదలైన అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

# విద్యార్థులకు మెనూను తప్పక అమలు చేయాలి

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన అదనపు కలెక్టర్ నగేష్**

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**విద్యార్థులకు మెనూ ను తప్పక అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.**



**టేక్మల్: మార్చ్ 20 ( మీడియా టుడే)**
శుక్రవారం టేక్మల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఆగ్రో సేవకేంద్రాన్ని ,గ్యాస్ గోదామును పరిశీలించారు. కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేజీవీబీ పాఠశాలలో స్టోర్ రూమును,కిచెన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కేజీవీబీ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ తప్పక అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఉచిత విద్యా, అందించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.ఆగ్రో సేవకేంద్రం లో పలు రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించారు. రైతులకు అన్ని మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియాను త్వరిత గతిన అందించాలన్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ సమస్యపై చింతించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా లో సరిపడ గ్యాస్ సిలిండర్లు ఉన్నాయన్నారు. గ్యాస్ సమస్యను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

**మండల విద్యాశాఖ అధికారి చలపతిరావు**



**నేలకొండపల్లి మార్చి 23**
నేలకొండపల్లి మండల పరిధిలోని మంగాపురం తండా గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఫేర్వెల్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేలకొండపల్లి మండల విద్యాశాఖ అధికారి చలపతిరావు మాట్లాడుతూ విద్యాబోధనసక్రమంగాజరపాలనివిద్యార్థులకు అర్థమయ్యేలా ప్రతి ఉపాధ్యాయుడు బోధించాలని చెప్పారు. ప్రతి ఉపాధ్యాయుడు విధిగా విద్యార్థుల సంఖ్య పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగాపురం తండా గ్రామపంచాయతీ సర్పంచ్ డి అశోక్ రాణి. గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ డి నాగరాజు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్. నేలకొండపల్లి మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాధాకృష్ణ. ఉపాధ్యాయులు వెంగళరావు. ఉపేందర్.దశావత్. తదితరులుపాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద







**వరంగల్ జిల్లా బ్యూరో నర్సంపేట, మార్చి 20,మీడియా టుడే.**
నర్సంపేట పట్టణ మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ మరియు నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పండించిన మొక్కజొన్నకు సరైన ధర లభించేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సూచించిన కలెక్టర్, తేమ శాతం (మాయిశ్చర్) 14 శాతానికి మించకుండా ఉండాలని తెలిపారు. అలాగే, క్వింటాల్‌కు రూ. 2400 ధర ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలలోనే తమ పంటను విక్రయించాలని సూచించారు. రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించి రైతులకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, డిఎం మార్క్‌ఫెడ్ రంజిత్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుట్కా, పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయం

## - నలుగురిపై కేసులు నమోదు




**వరంగల్ జిల్లా, గీసుగొండ, మార్చి 20, మీడియా టుడే.**
గీసుగొండ మండలంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కా మరియు పొగాకు ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఊకల్ మరియు ధర్మారం గ్రామాల్లోని కిరాణా, పాన్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచుల సమక్షంలో తనిఖీలు చేపట్టి, వారి వద్ద నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా మరియు ఇతర పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.విద్యాసంస్థల సమీపంలో ఈ ఉత్పత్తులను విక్రయిస్తూ ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో సంబంధిత నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.కేసులు నమోదైన వారిలో ఊకల్ గ్రామానికి చెందిన బోయిని రాజేష్ కుమార్ (30), ఎలసరపు రజినీకాంత్ (50), అలాగే ధర్మారం గ్రామానికి చెందిన పాలబోయిన సుమంత్ (26), పార్వతి ప్రణయ్ (28) ఉన్నారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని గీసుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# అడవుల సంరక్షణ అందరి బాధ్యత




**రాయికల్-మీడియా టుడే-మార్చి 20:**
అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని పారెస్ట్ సెక్షన్ అధికారి శాంబయ్య అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం...ప్రపంచ అడవి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ శాంబయ్య పక్షుల సంరక్షణ... అడవుల పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గూళ్లు తయారు చేయడం, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు రాజేందర్, బీట్ ఆఫీసర్ రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, వసంతరావు, లక్ష్మి, రాజశేఖర్, మహేష్, ఆనంద్, రాజన్న, రతిలాల్, బాలమురళి రజిత, మల్లారెడ్డి, శంకరయ్య, కృష్ణ ప్రసాద్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ జిల్లా, బ్యూరో మార్చి 20,మీడియా టుడే.**
వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారదా దేవి నేడు పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు కూడా పాల్గొన్నారు. కలెక్టర్ ఓపీ రిజిస్టర్, హాజరు నమోదు పుస్తకాలు, ఔషధ నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ప్రధానంగా ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సిబ్బందిని ఆదేశించారు. అలాగే బాల్య వివాహాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.ఆరోగ్య కేంద్ర పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు అవసరమైన అనుమతులు తీసుకొని వెంటనే చర్యలు చేపట్టాలని, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను త్వరితగతిన అమలు చేసి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిదురు శంకర్, వైద్యాధికారులు డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ మౌనిక, రెవెన్యూ, పంచాయతీరాజ్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# " దురందర్ -2 " సినిమా వీక్షించిన బండి సంజయ్



**కరీంనగర్ జిల్లా స్టాప్ రిపోర్టర్ మీడియా టుడే మార్చి 20:**
శుక్రవారం రోజు సాయంత్రం 5 గంటలకు , కరీంనగర్ పట్టణ కేంద్రం లో గల మమత థియేటర్ లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో "దురంధర్ -2" సినిమా వీక్షించిన బిజెపి నాయకులు, మంత్రి బండి సంజయ్ తో పాటు కరీంనగర్ లో మున్సిపాల్టీ బిజెపి జెండా ఎగురవేసిన కార్పొరేటర్లు , కాంటెస్టెడ్ కార్పొరేటర్లు రాష్ట్ర ప్రతినిధులు ,జిల్లా ప్రధానాధికారులు వివిధ ముఖ్య నాయకులు మరియు అభిమానుల తో పాటు కలిసి సినిమా వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం పోరాటం చేస్తున్న వారిని మనం ఎప్పటికీ మర్చిపోలేమని , హిందూ ధర్మం కోసం హిందువులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ భూమి పూజ ఘనంగా నిర్వహణ

## పాల్గొన్న అందరికీ నిర్వాహకుల కృతజ్ఞతలు

**వరంగల్ జిల్లా బ్యూరో మార్చి 20, మీడియా టుడే.**
ఖానాపురం మండలం కొత్తూరు గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం జై భీమ్ యువజన పొదుపు సంఘం గౌరవ అధ్యక్షులు కందికట్ల వీరేష్ న్యాయవాది అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భూమి పూజ కార్యక్రమం నిర్వహించడంతో పాటు బౌద్ధ మత జెండాను ఆవిష్కరించారు. మండలంలో మొదటిసారిగా అంబేద్కర్ విగ్రహ భూమి పూజ జరగడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో మాట్లాడిన పలువురు ప్రముఖులు, అంబేద్కర్ బోధించిన "బోధించు – సమీకరించు – పోరాడు" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 14న జరగనున్న అంబేద్కర్ జయంతి నాటికి విగ్రహాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారుఈ కార్యక్రమానికి ఖానాపురం ఎస్సై రఘుపతి, సర్పంచ్ జాటోతు వినోద్ కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ తదితరులు హాజరై తమ సందేశాలను అందించారు.అలాగే వివిధ రాజకీయ, సామాజిక సంస్థల నాయకులు, బౌద్ధ మత ఉపాసకులు, విద్యావేత్తలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బౌద్ధ మత ప్రముఖులు, ప్రొఫెసర్లు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.జై భీమ్ యువజన పొదుపు సంఘం అధ్యక్షులు కందికట్ల వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు మేడిపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి జేరిపోతుల అజయ్ కుమార్ రెడ్డి సహా సంఘం సభ్యులు కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన వారందరికీ అభినందనలు తెలిపారు.చివరగా, "బాబాసాహెబ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో మనమందరం భాగస్వాములం కావడం గర్వకారణం" అని నిర్వాహకులు పేర్కొన్నారు.



# గత బడ్జెట్‌పై శ్వేత పత్రం విడుదల చేయాలి

## ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్



**వరంగల్ జిల్లా బ్యూరో , మార్చి 20 ,మీడియా టుడే.**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై అసెంబ్లీలో గత బడ్జెట్ ఆదాయ-వ్యయాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ "పేరు గొప్ప ఊరు దిబ్బ"లా ఉందని, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధి లేదని ఈ బడ్జెట్ స్పష్టంగా నిరూపించిందని ఆయన విమర్శించారు. వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు.శాసనసభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ. 3,24,234 కోట్ల 2026--27 బడ్జెట్‌ను 10 శాతం వృద్ధిరేటుతో ఆర్భాటంగా ప్రవేశపెట్టినా, ఆచరణలో మాత్రం విరుద్ధంగా పాలన కొనసాగుతోందని విమర్శించారు.అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి, రెండున్నర సంవత్సరాలు గడిచినా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నార్థకంగా మారుస్తుందని అన్నారు.రైతుల సంక్షేమానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రైతు రుణాలు, రైతు భరోసా, వరి ధాన్యం బోనస్ వంటి అంశాల్లో చెల్లింపులు జరగకపోవడం ఆందోళనకరమన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయడానికి ధరల స్థిరీకరణ నిధిని కేటాయించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.రాష్ట్ర అభివృద్ధి సాధించాలంటే చిన్న, సన్న రైతులకు ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ రంగానికి కనీసం 20 శాతం బడ్జెట్ కేటాయించాలని, అలాగే ఉపాధి, మహిళా, పారిశ్రామిక, కార్మిక రంగాలకు తగిన నిధులు పెంచాలని సూచించారు.అదేవిధంగా విద్య, వైద్య రంగాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఆరు గ్యారెంటీలు మరియు 420 హామీలను నెరవేర్చే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ వైఫల్యాలను చూపిస్తూ ప్రస్తుత బడ్జెట్ లోపాలను మరుగుపరచే ప్రయత్నాలు చేయకూడదని ఆయన హెచ్చరించారు.

# మాది కుటుంబ వివాదం

## - రాజకీయ నేతల ప్రమేయం లేదు

**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి మర్చ్ 20**
వట్టినాగులపల్లి ప్రాంతంలోని సర్వే నంబర్లు 259, 245 మధ్య సుమారు 2 ఎకరాల భూమిపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం నెలకొంది. ఈ విషయం ప్రస్తుతం కోర్టులో విచారణలో (సబ్‌జ్యుడిస్) ఉండగా, ఇరు పక్షాలు కోర్టు ఆదేశాల కోసం వేచి ఉన్నాయి. ఓ పక్షంకు చెందిన అక్షయ్ షా, అవినయ్ షా, సతీష్ షా తెలిపిన వివరాల ప్రకారం.. ఏడి సర్వే ద్వారా సర్వే నం. 245 పక్కన ఉన్న 3.5 ఎకరాల భూమిపై తమ హక్కులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. అయితే సర్వే నంబర్ 245 యజమానులు అనుమతి లేకుండా అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టి సుమారు 2 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా, కోర్టు కేసులో పేర్కొన్నట్లుగా సర్వే నం. 245 భూమి సరిహద్దులు స్పష్టంగా గుర్తించలేనివిగా ఉన్నాయని తెలిపారు. ఈ భూమిని అభివృద్ధి చేయడానికి "న్యూజెన్" అనే డెవలపర్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. అయితే వివాదం పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కాదన్నారు. సమస్యను రాజకీయ రంగంలోకి తేకుండా, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఇరు పక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సంయుక్త సర్వే ద్వారా సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచిస్తూ, సర్వే నం. 245 యజమానులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు.



# రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి



**రాయికల్–మీడియా టుడే–మార్చి 20:**
రాయికల్ మండలం మైతాపూర్ శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కనకదుర్గా దేవి ఆలయానికి ప్రధాన రహదారి నుంచి సిసి రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని శుక్రవారం తహశీల్దార్ నాగార్జునకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ...మధ్యలో భూమి పట్టాదారులు అడ్డుపడటంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని... రెవెన్యూ అధికారులు సరిహద్దులు నిర్ణయిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, తొగిటి నవీన్, అనుమల్ల రమ, బూస గంగామల్లయ్య, భూపల్లి పరమేష్, నాయకులు సత్యనారాయణ తదితరులున్నారు.

# వైద్య శిబిరం



**రాయికల్–మీడియా టుడే–మార్చి 20:**
రాయికల్ మండలం ఒడ్డేలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్పెషలిస్ట్ డాక్టర్ లతో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 248మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి...54 మందిని రిఫర్ చేయడం జరిగిందని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజేందర్ రెడ్డి, డాక్టర్లు సతీష్ కుమార్, నిఖిత, రాజేశ్వర్, వైష్ణవి, అనూష, లావణ్య, హరికృష్ణ , ఎంపిఓ శుష్మ, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలిలో వైభవంగా ప్రీ-రంజాన్ వేడుకలు

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా కార్యక్రమం




**వరంగల్, మార్చి బ్యూరో 20,మీడియా టుడే.**
నర్సంపేట పట్టణంలో ఉన్న గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ప్రీ–రంజాన్ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ముస్లిం సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, వివిధ మతాలు, భాషలకు చెందిన ప్రజలు కలిసికట్టుగా జీవించడం దేశ ప్రత్యేకత అని ఈ సందర్భంగా స్పష్టమైంది. పాఠశాలలోని ముస్లిం విద్యార్థులు, అధ్యాపకులకు ఇతర విద్యార్థులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. రాజేష్ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవంగా చూడడానికి కారణం ప్రజల ఐక్యతేనని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పరమత సహనాన్ని పెంపొందించడం పాఠశాలల బాధ్యత అని, ఇతర మతాల పండుగలను గౌరవించడం ద్వారా పరస్పర ప్రేమాభిమానాలు పెరుగుతాయని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ఒకరికొకరు ఖర్జూరాలు, మిఠాయిలు తినిపించుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకలు సౌహార్ద వాతావరణంలో ఆనందంగా కొనసాగాయి.

# నూతన రోడ్డును శంకుస్థాపన చేసిన మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ సర్పంచ్ అంకం సుమలత రాజు యదవ్

**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి మర్చి20**



పెద్ద తుప్పర గ్రామంలో 9వ వార్డులో నూతన రోడ్డును శంకుస్థాపన చేసిన మాజీ ఎంపీపీ దీద్యాల జయమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన రోడ్డును శంకుస్థాపన చేసిన సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్. వారు మాట్లాడుతూ పెద్ద తుప్పురా గ్రామం అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు రాబోయే రోజులలో గ్రామ అభివృద్ధి ముందు అడుగు ఉంచుతామని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీద్యాల శేఖర్ వార్డు సభ్యులు విద్యాల నరేష్ కుమార్ దిద్యాల రాజు నల్లోల అశోక్ విద్యాచరన్ స్రవంతి శివకుమార్ నల్లోల్ల చెన్నకేశవ బొగ్గుల సురేష్ గౌడ్ కేతావత్ లీలాబాయి శ్రీను గ్రామ పెద్దలు దిద్యాల అంజయ్య తెగలమల్ల దాసు విద్యాల గౌతం దిద్యాల శశికాంత్ కేతావత్ అరవింద్ బొగ్గుల ప్రకాష్ అంకం రాఘవేందర్ మహిళ యాదయ్య కేతావత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# విప్లవ సింహం,వీరవనిత మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి

## సిపిఎం మండల లికార్యదర్శి - బెల్లంకొండ సత్యనారాయణ



**మీడియా టుడే ప్రతినిధి కృష్ణ మార్చి 20 కోదాడ నడిగూడెం**
నడిగూడెంమండలకేంద్రంలోని వేణుగోపాలపురంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు విప్లవ సింహం,వీర వనిత మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని మానవత విలువలను నేటి యువతకు భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు.ఈరోజు నడిగూడెం మండలం వేణుగోపాలపురం గ్రామంలో మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి కార్యక్రమాలో బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం భూస్వామ్య కుటుంబంలో పుట్టి చిన్ననాటి నుండి అన్న భీమిరెడ్డి తో కలిసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని పేద ప్రజల పక్షాన పోరాటం చేశారని జీవితాంతం నిరుపేదల,మహిళల, రైతుల హక్కుల కొరకు పోరాటం చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్ పిచ్చయ్య,వార్డు మెంబర్ సంపత్ అచ్చమ్మ, తిరపయ్య,బెజవాడ గోపాల్, రాంబాయి,శిరీష,ఎంకమ్మ, రామయ్య, భరత్,శ్రీలత పూజిత,సైదులు,గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ








**వరంగల్ జిల్లా, బ్యూరో మార్చి 20,మీడియా టుడే.**
వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారదా దేవి నేడు పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు కూడా పాల్గొన్నారు. కలెక్టర్ ఓపీ రిజిస్టర్, హాజరు నమోదు పుస్తకాలు, ఔషధ నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ప్రధానంగా ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సిబ్బందిని ఆదేశించారు. అలాగే బాల్య వివాహాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.ఆరోగ్య కేంద్ర పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు అవసరమైన అనుమతులు తీసుకొని వెంటనే చర్యలు చేపట్టాలని, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను త్వరితగతిన అమలు చేసి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిదురు శంకర్, వైద్యాధికారులు డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ మౌనిక, రెవెన్యూ, పంచాయతీరాజ్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# విజ్డమ్ హై స్కూల్ మెడికో విద్యార్థులకు ఘన సన్మానం

**వరంగల్, మార్చి బ్యూరో 20,మీడియా టుడే.**
నర్సంపేట పట్టణంలో ఉన్న విజ్డమ్ హై స్కూల్లో 2022--2023 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినిలు 2025 చీజుజు పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఎంబిబిఎస్‌లో సీట్లు పొందడంతో పాఠశాలలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జావేద్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో పాటు తల్లిదండ్రుల పట్ల అభిమానం, ఉపాధ్యాయుల పట్ల గౌరవం కలిగి విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ఈ విజయాలు తమ పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.విద్యార్థిని శరదృతి ఉత్తమ ర్యాంకు సాధించి కాకతీయ మెడికల్ కాలేజీ లో ప్రవేశం పొందగా, ముత్తినేని అంకిత రిమ్స్ మెడికల్ కాలేజీ లో ఎంబిబిఎస్ సీటు సాధించింది.పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్ మాట్లాడుతూ, సరైన సన్నాహం ఉంటేనే విజయం సాధ్యమవుతుందని, లేకపోతే అపజయం తప్పదని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.శరదృతి మాట్లాడుతూ, నర్సరీ నుంచి పదవ తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివిన తాను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని, భవిష్యత్తులో వైద్య వృత్తిలో



రాణించి పేదలకు సేవ చేయాలనుకుంటున్నానని తెలిపారు.అంకిత మాట్లాడుతూ, ఏకాగ్రతతో చదివితే విజయం సులభమవుతుందని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో పయనిస్తూ కుటుంబానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వెలిదండ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎస్.సి. శ్రీనివాసులు హామీ



(మీడియా టుడేగరిడేపల్లి, మార్చి 20:)
సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఎస్.సి. శ్రీనివాసులు గారు శుక్రవారం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. గ్రామంలో గత కొంతకాలంగా వేధిస్తున్న లో-వోల్టేజ్, తరచుగా విద్యుత్ అంతరాయం మరియు ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలపై స్థానిక ప్రజలు ఆయనకు విన్నవించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన ఎస్.సి. , సమస్యలను స్వయంగా పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, తక్కువ వోల్టేజ్ సమస్య తలెత్తకుండా అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు లేదా సామర్థ్యం పెంపుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏఈ మరియు కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.ప్రజల ఇబ్బందుల పట్ల సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయికి వచ్చిన ఎస్.సి. గారి పట్ల వెలిదండ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే తమ గ్రామానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య , కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు , రిటైర్డ్ హెడ్మాస్టర్ పోటు రామారావు , వార్డ్ మెంబర్ ములకలపల్లి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలవాల నాగయ్య, గ్రామ కార్యదర్శి నాగేంద్రబాబు, విద్యుత్ శాఖ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోడు జీవుల గోడు...



అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్లపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన? మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు? నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

# మద్దతు ధరల మర్మం !



కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది.

రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిం చడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్ర్య వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయలేక ఉరి తాడును ఆశ్రయిస్తున్న వారున్నారు. రైతులకు ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ వరకు దాదాపు ఏడాదిన్నర కాలం ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మకమైన రైతు ఉద్యమం వల్ల రైతులకు గట్టిగా చేసిందేమీ లేదు. మూడు నల్ల చట్టాలను వారి ముందు ఉరి తాళ్ళ మాదిరిగా వేలాడ దీసి రెచ్చగొట్టి ఉద్యమంలోకి లాగిన తీరును దేశం ఇంకా మరచిపోలేదు. ఈ క్రమంలో మద్దతు ధరలు మరింతగా పెరగాలి. వ్యయసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి కావాలసిన వసతులను సమకూర్చి దేశంలో దీనిని అగ్రగామిగా నిలబెట్టాలి. అంతేకా కుండా... ఆదాయవనరుగా తీర్చిదిద్ది నిరుద్యోగాన్ని నిర్మూలించేలా చేయాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను మరింతగా ప్రోత్సహించాలి. అప్పుడే వ్యవసాయం బతికిబట్ట కలదు. తాజాగా చెరుకుకే కాకుండా మిగతా పంటలకు కూడా మద్దతు ధరలను పెంచాలి.

# కార్పొరేట్ కులతత్వం




జిలుగువెలుగుల కార్పొరేట్ ప్రపంచం అడుగున కులతత్వం కుళ్లు కంపు కొడుతున్నదా? మడతలు నలగని సూటూబూటూ కింద సంకుచిత కులాధిపత్యం పాకుతున్నదా? లేక వేళ్లానుకొని కుక్కమూతి పిందెలు వేస్తున్నదా? ఇండిగో సంస్థలో ఓ ఉద్యోగికి ఎదురైన చేదు అనుభవం జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంకా వెనుకబాటుతనం పూర్తిగా మాసిపోని పల్లెటూళ్లలోనో, ఆధిపత్యవాదం రాజ్యమేలే గొప్పగొప్ప విద్యాసంస్థల్లోనో కులతత్వం ఉందంటే నిజమే అనుకోవచ్చు. అందుకు సంబంధించిన వార్తలు మనం తరచుగా వింటూనే ఉంటాం. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల దళిత పెండ్లిళ్లలో వరుడు గుర్రమెక్కి ఊరేగడం ప్రాణాంతకమే. పేరుమోసిన వర్సిటీల్లో దళిత బిడ్డలు వేధింపులు భరించలేక ఉసురు తీసుకునే ఉదంతాలు మన దృష్టికి ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇది నవభారతం మోస్తున్న నిన్నటి శాపం, రేపటి పాపం. ఒక కార్పొరేట్ సంస్థలో 'నువ్వు అధముడివి, విమానాలు నడపడంతో నీకేం పని.. పోయి చెప్పులు కుట్టుకో' అని తోటి ఉద్యోగులు ఓ దళిత బహుజన పైలట్‌ను దారుణంగా అవమానించడం ఏమిటి? చెప్పులు కుట్టే చేతులు విమానాలు నడపొద్దని రాజ్యాంగం ఏమైనా చెప్తున్నదా? భారతదేశానికి కులవివక్ష కొత్త కాదు. కానీ, కార్పొరేట్ తెరమీద అది మరీ ప్రస్ఫుటంగా ప్రత్యక్షం కావడం ఆలోచింపజేస్తున్నది. ఉద్యోగి తన బాస్‌ల మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలైంది. విచారణలో ఏం తేలుతుందనేది వేరే సంగతి. కానీ, ఈ ఘటనతో కార్పొరేట్ ప్రపంచంలో కులతత్వంపైకి అందరి దృష్టి మళ్లింది. ఆర్థిక సరళీకరణల భుజాలపై ఊరేగుతూ ప్రపంచీకరణ దూసుకొస్తున్న రోజుల్లో ప్రపంచం ఓ కుగ్రామంలా మారుతున్నదనే మాట తరచుగా వినిపించేది. అడ్డుగోడలు తొలగిపోతున్నాయన్న భావనలు పురివిప్పుకొన్నాయి. భారత్ అంతకంతకూ విశ్వ ఆర్థికవ్యవస్థతో పెనవేసుకుపోతున్న నేపథ్యంలో మన నేతలు తరచుగా వసుధైవ కుటుంబం అనే భావనను పదేపదే ఉల్లేఖించడం పరిపాటి అయిపోయింది. కానీ, ఆ ఉదాత్త భావనను సాధించడానికి భారత్ ఇంకా చాలాచాలా దూరంలో ఉన్నదని ఇటీవల ఈ గడ్డ మీద జరుగుతున్న సంకుచిత కుల వైషమ్యాలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ జోరులో విస్తరించిన కార్పొరేట్ ప్రపంచంలో కులాతీత, ప్రజ్ఞ ఆధారిత ప్రోత్సాహమే ఉందనేది సాధారణ అవగాహన. కానీ, ఇండిగో ఉదంతం ఇదంతా భ్రమేనని అంటున్నది. కులవ్యవస్థ అనేది శ్రమ విభజన మాత్రమే కాదని, అది శ్రామికుల విభజన అని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ ఇక్కడ గుర్తుకువస్తున్నది. కార్పొరేట్ ఆధిపత్య వ్యవస్థ అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థగా రూపొందేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, ఆ దిశగా నిచ్చెనలు అందుకునేలోగా కులతత్వం పాములు కిందకు ఈడ్చేయకుండా చూసుకోవాలి.

# జలమే మానవాళికి జీవనాధారం



**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వసం చేయడం, చెరువుల, కాలువను ధ్వసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018–2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

**దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి**

**మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి**

**న్యూఢిల్లీ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోడీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణలతో పాటు రాజకీయనేతలో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు ఇప్పటికైనా స్పందించాలి. మోడీ విధానాలకు తందానా అనకుండా అంతర్గగత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. నల్లధనాన్ని తవ్వితీయ డమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించి పన్నులను హేతుబద్దీ కరించాలి. పోపుల డబ్బాలో కూడబెట్టుకున్న దానికి సైతం జిఎస్టీ కట్టే దరిద్రం దాపురించింది. అధికారం లోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదు. ఈ క్రమంలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది.

# తిరుమలలో విఐపిలకే ప్రాధాన్యం

**సామాన్యులకు దక్కని దర్శనభాగ్యం**

**తిరుమల :** తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లో నిండి బయటకు క్యూలు కడుతున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. విఐపిలు పదేపదే రావడంతో వారికోసం దర్శనాలను నిలిపివేస్తున్నారు. వారి రాకను నియంత్రిస్తామన్న హామీ నెరవేరడం లేదు.తిరుమల శ్రీవారిని సామాన్యులు మాత్రమే దర్శించుకునేలా ఆంక్షలు విధించాలని భక్తులుకోరుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లోనూ విఐపిలు రావడం వల్ల తీవ్రిబ్బందులు కలుగుతున్నాయని, సామాన్యులకు దర్శనం కలగడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తులు తమ ఆపదల మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని అలాంటి సమయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అయినా దేవుడికి భక్తుడికి మధ్య అధికారుల పెత్తనం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమలలో ముందు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా విఐపిలను నియంత్రించాలని అన్నారు. ఆ నిబంధనేదో ముందు ప్రజాప్రతినిధులకు విధించాలని అంటున్నారు. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు. ప్రశాంతతకు మారుపేరు తిరుమల.. అయితే పెత్తనం చెలాయించాలనుకోవడం సరికాదు. ఇకపోతే ఇటీవల ఇక్కడ అన్యమత ప్రచారాలు, మద్యం, మాంసం తదితర విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గవర్నర్ వ్యవస్థ రద్దు కోసం పోరాడాలి !

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ఇటీవల అనేక చారిత్రక తీర్పులను వెలువరిస్తోంది. అనేక విషయాల్లో మార్గనిరద్దేశనం చేస్తోంది. ఇవన్నీ కూడా పాలకులకు కనువిప్పు కావాలి. రాజకీయ నాయకులపై కేసులు కావచ్చు..వారి ఆస్తులు కావచ్చు..గవర్నర్ వ్యవస్థ కావచ్చు..ఇలా అనేక త చారిత్రక తీర్పులు వస్తున్నాయి. ఇకపోతే గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిది. దానితో ఆడుకోవడం రాజకీయ నాయకులకు అవసరం. అందుకే గవర్నర్ వ్యవస్థను ఎత్తేయలేకపోతున్నారు. దేశంలో ఈ వ్యవస్థ వల్ల ఏటా వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. రాజకీయ పాచికలు ఆడేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఉపయోగించు కుంటోంది తప్ప ప్రజలకు నేరుగా ఉపయోగం లేదు. అంతేకుండా రాష్ట్రాల్లో అనవసర అధికార కేంద్రంగా మారింది. దీనిని ఎత్తేయాలని ఎన్టీఆర్ సహా అందరూ డిమాండ్ చేసినవారే. కానీ వినేదెవ్వరు... వినిపించే దెవ్వరు అన్న చందంగా ఇప్పుడు పరిస్థితి తయారయ్యింది. గవర్నర్ పోస్టు లేకుండా ప్రభుత్వం నడుస్తుంది. కానీ దీనివల్ల ఉపయోగం లేదని తెలిసినా కొనసాగిస్తున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఉపయోగిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్, ఉన్నా, ఇప్పుడు బిజెపి ఉన్నా ఒరిగిందేమీ లేదు. అందుకే దివంగత ఎన్టీఆర్ దీని రద్దు కోసం ఆనాడు గట్టిగానే డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు కూడా ఇవే డిమాండ్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిజెపిలు మాత్రం రోరు మెదపడం లేదు. ఇటీవల తమిళనాడు వ్యవహారం తీసుకుంటే ఎంత రచ్చయ్యిందో చూశాం. గతంలో బెంగాల్లోనూ, కేరలలోనూ ఇదే తరహా రాజకీయాలు నడిపారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళిసై సైతం ఇదే తరహాలో వ్యవహరించింది.కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ తాబేదార్లు గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోంది. కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్పింది. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇటీవల సుప్రీంతో చివాట్లు తిన్నారు. అంతేగాకుండా ఆయన ప్రమేయం లేకుండానే బిల్లులను పాస్ చేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అనేక చారిత్రాత్మక తీర్పులను వెలువరిస్తున్న సుప్రీంకోర్టు...మరో చారిత్రాత్మక తీర్పుతో తమిళనాడు గవర్నర్ చెంపచెల్లుమనిపించింది. గవర్నర్ల మితిమీరిన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు...బిజెపి కాంగ్రెస్‌లకు కనువిప్పుకావాలి. కాంగ్రెస్ కాలం నుంచే గవర్నర్ వ్యవస్థను రాజకీయపునరావాస కేంద్రాలుగా మార్చుకుంది. బిజెపి కూడా దానిని కొనసాగించింది. తమిళనాడు గవర్నర్ రవి అనుసరించిన తీరుపై సుప్రీం తీర్పు రాజ్యాంగ వ్యవస్థను బలోపేతం చేసేదిగా ఈ తీర్పు... సహజంగానే డిఎంకె ప్రభుత్వానికి భారీ విజయంగా చూడాలి.. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఫెడరలిజం బలోపేతానికి జరుగుతున్న పోరాటానికొక ఊతం. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకో రక్షణ కవచం. ఈ తీర్పు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమైనది కాదు. మొత్తం భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సంబంధించినది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు సూటిగా ఉంది. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. అంతేకాదు గవర్నర్లు ఎంతో ఉండాలో నిర్దేశించింది. నెలలోగా బిల్లులను ఆమోదించాలని చెప్పింది. లేకుంటే అవి బిల్లులగా మారుతాయని తేల్చింది. ఈ తీర్పు ఎలాంటి అనుమానాలు లేకుండా చాలా స్పష్టంగా వుంది. గవర్నర్లంటే... కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసే దుస్సంప్రదాయానికి ఈ తీర్పు చెల్లుచీటీ రాసింది. బిజెపి ఎక్కడా ఈ తీర్పుపై మాట్లాడ లేదు. రాజ్యాంగానికి దెబ్బపడకుండా చూస్తామని చెప్పలేదు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తాజాగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కిపెట్టిన గవర్నర్ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. 'కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే తొక్కిపెట్టి , ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షం' అని అభివర్ణించింది. తమిళనాడు గవర్నర్ రవి తన నియామకం జరిగిన నాటినుంచీ ఇలాగే వ్వయహరించారు. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశిరచింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకున్న చర్యలన్నీ రద్దవుతా యని, అసెంబ్లీ... గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీ నుంచి ఈ బిల్లులన్నీ ఆమోదం పొందినట్లు- పరిగణించాలని సుప్రీం స్పష్టం చేసింది. అంతేకాదు, గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు తప్పుబట్టింది. ప్రజలచే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వీరికి ఇవ్వలేదని కోర్టు పునరుద్ఘాటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావసరాలు, సంక్షేమం కోసం చట్టాలను రూపొందిస్తాయి. వాటిని నిరోధించే వైఖరి రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడటం గవర్నర్ పని కాదని ఎత్తిచూపుతూ...గవర్నర్ రవి అడ్డుకున్న పది బిల్లులను సుప్రీం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సమర్థించే ఈ తీర్పు...అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఒక హెచ్చరిక. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు చెంపపెట్టు లాంటిదని కడా చెప్పకతప్పదు. అంబేద్కర్ యంతికి ముందు వచ్చిన ఈ తీర్పు రాజ్యాంగాన్ని కాలరాస్తున్న వారికి కనువిప్పుకావాలి. ఈ సందర్భంగా ఉటంకించిన సుప్రీంకోర్టు పాలకులకు గట్టిగానే చురకలు వేసింది. ఈ క్రమంలో వచ్చిన ఈ తీర్పుతో...అస్పష్టతకు తెరపడింది. బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదని చేసే వాదనలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. ఈ తీర్పుతో అయినా గవర్నర్ వ్యవస్థ పనిలేదని గుర్తించాలి. దీనిని రద్దు చేసేందుకు అంతా ఉద్యమించాలి.

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !



**న్యూఢిల్లీ :** అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహతంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శతృవులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్తలను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చు కోవాలి. ఇటీవల ఆక్వా ఎగగుమతులపై ట్రంప్ ప్రభావం పడింది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపతేం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు. చైనా తరహాలో కఠినంగా సాగితేనే ఇది సాధ్యమని గుర్తించాలి.

# సహజంగా మగ్గిన మామిడిపండ్లు

## గుర్తించడం ఎలా, ఏవి ప్రమాదం?



వేసవి వచ్చిందంటే చాలు, మామిడిపండ్ల రాయల్టీ మొదలైనట్లే. నోరూరించే మామిడి పండ్లను ఆస్వాదించాలని అందరూ ఆరాటపడతారు. అయితే, మార్కెట్లో లభించే అన్ని మామిడిపండ్లు సహజంగా పండినవి కావు. త్వరగా సొమ్ము చేసుకోవాలనే అత్యాశతో కొందరు వ్యాపారులు రసాయనాలను ఉపయోగించి కాయలను కృత్రిమంగా పండిస్తున్నారు. ఇలా రసాయనాలతో పండిన మామిడిపండ్లు ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, సహజంగా మగ్గిన మామిడిపండ్లను ఎలా గుర్తించాలి, రసాయనాలతో పండినవి ఎందుకు ప్రమాదకరమో తెలుసుకుందాం.

**సహజంగా మగ్గిన మామిడిపండ్లను గుర్తించడం ఎలా?**

సహజంగా పండిన మామిడిపండ్లను కొన్ని సులభమైన పద్ధతుల ద్వారా గుర్తించవచ్చు

**రంగు:**

సహజంగా పండిన మామిడిపండ్లు ఒకే రంగులో కాకుండా, పసుపు మరియు ఆకుపచ్చ రంగుల మిశ్రమంతో లేదా కొన్నిసార్లు ఎరుపు రంగుతో కూడి ఉంటాయి. రసాయనాలతో పండినవి పండు మొత్తం ఒకే ప్రకాశవంతమైన పసుపు రంగులో కనిపిస్తాయి, అక్కడక్కడ ఆకుపచ్చ లేదా నల్లటి మచ్చలు ఉండవచ్చు. వాసన: సహజంగా పండిన మామిడిపండ్ల నుండి మధురమైన, సహజ సిద్ధమైన వాసన వస్తుంది. రసాయనాలతో పండిన పండ్ల నుండి ఘాటైన వాసన రావచ్చు, లేదా అసలు వాసనే రాకపోవచ్చు.

**తాకి చూడటం:**

సహజంగా పండిన మామిడిపండును నొక్కితే కొద్దిగా మెత్తగా అనిపిస్తుంది. రసాయనాలతో పండినవి ఎక్కువగా మెత్తగా లేదా అసహజంగా గట్టిగా ఉండవచ్చు.

**రుచి:**

సహజంగా పండిన మామిడిపండ్లు చాలా తియ్యగా, పులుపు లేకుండా ఉంటాయి. రసాయనాలతో పండినవి అంత తియ్యగా ఉండవు, కొన్నిసార్లు కొద్దిగా పులుపు ఉండవచ్చు. వీటిని తిన్నప్పుడు నోరు లేదా గొంతులో మంటగా అనిపించవచ్చు.

**గుజ్జు:**

సహజంగా పండిన మామిడిపండు లోపల గుజ్జు ప్రకాశవంతమైన ఎరుపు లేదా పసుపు రంగులో, రసంతో నిండి ఉంటుంది. రసాయనాలతో పండిన పండు గుజ్జు లేత పసుపు లేదా ముదురు పసుపు రంగులో ఉండి, రసం తక్కువగా ఉంటుంది. గుజ్జు అంతా ఒకే విధంగా పండి ఉండదు.

**నీటి పరీక్ష (ఫ్లోట్ టెస్ట్):**

ఒక బకెట్ నిండా నీరు తీసుకుని, అందులో మామిడిపండ్లను వేయండి. సహజంగా పండిన మామిడిపండ్లు నీటిలో మునిగిపోతాయి. రసాయనాలతో పండినవి నీటిపై తేలుతాయి.

**బేకింగ్ సోడా పరీక్ష:**

ఒక గిన్నెలో నీరు తీసుకుని, కొద్దిగా బేకింగ్ సోడా కలపండి. అందులో మామిడిపండును ఒక నిమిషం పాటు ఉంచండి. ఆ తర్వాత పండును కడిగి చూడండి. పండు రంగు మారితే అది రసాయనాలతో పండినట్లు అనుమానించవచ్చు.

**కృత్రిమంగా పండించడానికి ఉపయోగించే రసాయనాలు మరియు ప్రమాదాలు:**

మామిడిపండ్లను కృత్రిమంగా పండించడానికి ఎక్కువగా ఉపయోగించే రసాయనం కాల్షియం కార్బైడ్. ఇది వాతావరణంలోని తేమతో చర్య జరిపి ఎసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది. ఈ వాయువు పండ్లను త్వరగా పక్వానికి వచ్చేలా చేస్తుంది. అయితే, పారిశ్రామిక స్థాయిలో ఉపయోగించే కాల్షియం కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్ఫరస్ వంటి హానికరమైన మలినాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం.

**కాల్షియం కార్బైడ్ తో పండిన మామిడిపండ్లను తినడం వల్ల కలిగే ప్రమాదాలు:**

**నాడీ వ్యవస్థపై ప్రభావం:**

ఎసిటిలీన్ వాయువు నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మైకం, తలనొప్పి, నిద్రలేమి, మానసిక గందరగోళం వంటి సమస్యలు తలెత్తవచ్చు.

**జీర్ణ సమస్యలు:**

కడుపు నొప్పి, వికారం, వాంతులు, డయేరియా వంటి జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురవ్వవచ్చు.

**చర్మ సమస్యలు:**

చర్మంపై దద్దుర్లు లేదా పుండ్లు ఏర్పడవచ్చు.


దీర్ఘకాలిక అనారోగ్యాలు: కాల్షియం కార్బైడ్ లోని మలినాలు కాలేయం మరియు కిడ్నీలపై ప్రభావం చూపవచ్చు. కొన్ని అధ్యయనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను ప్రేరేపించవచ్చని సూచిస్తున్నాయి.

మింగడంలో ఇబ్బంది, అధిక దాహం, బలహీనత వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. భారతదేశంలో కాల్షియం కార్బైడ్ ను ఉపయోగించి పండ్లను పండించడం నిషేధించబడింది. పండ్లను పండించడానికి ఇథిలీన్ వాయువును ఉపయోగించడానికి అనుమతి ఉంది, ఇది సహజంగా పండ్లలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ మరియు ఆరోగ్యానికి అంతగా హానికరం కాదు. మామిడిపండ్ల సీజన్లో వాటిని ఆస్వాదించడం ముఖ్యం, కానీ ఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్త పడటం అంతే ముఖ్యం. మామిడిపండ్లను కొనుగోలు చేసేటప్పుడు వాటి రంగు, వాసన, మెత్తదనం వంటి లక్షణాలను జాగ్రత్తగా గమనించండి. వీలైతే, నీటి పరీక్ష వంటివి చేసి నిర్ధారించుకోండి. సహజంగా పండిన మామిడిపండ్లనే ఎంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఒకవేళ రసాయనాలతో పండించినవి అని అనుమానం వస్తే, వాటిని పూర్తిగా కడిగి, ముఖ్యంగా గోరువెచ్చని నీటిలో కొంతసేపు ఉంచి తినడం మంచిది. అయినప్పటికీ, రసాయనాలతో పండిన పండ్లకు దూరంగా ఉండటమే ఉత్తమ మార్గం.

## అవాంఛిత రోమాలతో బాధపడుతున్న మహిళలు..

# ఈ చిట్కాలను పాటించాలి..!

అవాంఛిత రోమాల సమస్యతో చాలా మంది మహిళలు బాధపడుతుంటారు.



ముఖంపై అవాంఛిత రోమాలు ఎక్కడ ఉన్నా కూడా అంద విహీనంగా కనిపిస్తారని ఆత్మన్యూనతకు లోనవుతుంటారు. అందులో భాగంగానే అన్‌వాంటెడ్ హెయిర్‌ను తొలగించుకోవడానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలను పాటిస్తుంటారు. అయితే ఇందుకు అంత శ్రమించాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా అవాంఛిత రోమాలను తొలగించుకోవచ్చని బ్యూటీ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. కొన్ని రకాల పదార్థాలను ఉపయోగించి ఇంటి చిట్కాలను పాటిస్తే అవాంఛిత రోమాలను సులభంగా తొలగించుకోవచ్చని వారు అంటున్నారు. ఇందుకు గాను ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**చక్కెర, నిమ్మరసం మిశ్రమం..**

2 టేబుల్ స్పూన్ల చక్కెర, 2 టేబుల్ స్పూన్ల నిమ్మరసం, 8 టేబుల్ స్పూన్ల నీళ్లను కలిపి ఈ మిశ్రమాన్ని పాన్‌లో వేసి సన్నని మంటపై వేడి చేయాలి. కొంత సేపటికి చక్కెర పూర్తిగా కరిగిపోతుంది. జెల్ లాంటి పదార్థం ఏర్పడుతుంది. ఇది కాస్త వేడిగా ఉండగానే అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. అనంతరం దానిపై ఒక శుభ్రమైన వస్త్రాన్ని ఉంచాలి. కాస్త ఆరాక వెంటనే వస్త్రాన్ని లాగాలి. దీంతో అవాంఛిత రోమాలు ఊడిపోయి వచ్చేస్తాయి. తరువాత నీళ్లతో కడిగేసి మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే అవాంఛిత రోమాల సమస్య ఉండదు. అయితే ఈ చిట్కా కొందరికి పడకపోవచ్చు. సున్నితమైన చర్మం ఉన్నవారు ఈ చిట్కాను పాటించకపోవడమే మంచిది.

**తేనె, నిమ్మరసం..**

1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం తీసుకుని బాగా కలిపి అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే అవాంఛిత రోమాలు రాలిపోతాయి. ఈ చిట్కా కాస్త ఆలస్యంగా పనిచేస్తుంది. కానీ చక్కని ఫలితాలను ఇస్తుంది. పైగా ఎలాంటి నొప్పి, బాధ ఉండవు. అలాగే 1-2 టేబుల్ స్పూన్ల పసుపులో కాస్త పాలు లేదా పెరుగు కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని సంబంధిత చోట్ల రాయాలి. పూర్తిగా తడి ఆరిపోయాక స్క్రబ్ చేస్తూ కడిగేయాలి. ఈ చిట్కా కూడా అవాంఛిత రోమాలను తొలగించడంలో అద్భుతంగానే పనిచేస్తుంది.

**బొప్పాయి పండు మిశ్రమం..**

1 లేదా 2 టేబుల్ స్పూన్ల బొప్పాయి పండు గుజ్జును తీసుకుని అందులో కాస్త పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని సంబంధిత చోట్ల రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. వారంలో 2-3 సార్లు ఈ చిట్కాను పాటించాలి. ఇలా తరచూ చేస్తుంటే సమస్య తగ్గిపోతుంది. 1 ఎగ్ వైట్‌ను తీసుకుని అందులో 1 టేబుల్ స్పూన్ చక్కెర, అర టేబుల్ స్పూన్ కార్న్ ఫ్లోర్ ను వేసి మెత్తని పేస్ట్‌లా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని రాసి పూర్తిగా పొడిగా మారిన తరువాత స్క్రబ్ చేస్తూ కడిగేయాలి. ఇలా తరచూ చేస్తున్నా కూడా అవాంఛిత రోమాలను సులభంగా తొలగించుకోవచ్చు. 2 టేబుల్ స్పూన్ల శనగపిండిలో తగినంత నీళ్లు, రోజ్ వాటర్ వేసి కలిపి అందులోనే కాస్త పసుపును కూడా వేసి కలిపి మెత్తని పేస్ట్‌లా మార్చాలి. దీన్ని రాస్తున్నా కూడా అన్‌వాంటెడ్ హెయిర్ తొలగిపోతుంది. ఇలా ఈ చిట్కాలను పాటిస్తే సమస్య తగ్గడంతోపాటు ముఖం అందంగా కూడా మారుతుంది.

# డయాబెటిస్ ఉన్నవారికి వరం ఈ ఆకులు..

## ఇంకా ఎన్నో లాభాలను పొందవచ్చు..

పొడపత్రి ఆకు.. దీన్నే కేరళ జిన్సెంగ్ అని, బ్రహ్మ మూలిక అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మన దేశంలోని పశ్చిమ కనుమల్లో ఎక్కువగా పెరుగుతుంది. కేరళలో ఈ మొక్కలు మనకు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఆయుర్వేదంలో ఈ మొక్క ఆకులను ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగిస్తున్నారు. ఈ మొక్క ఆకులు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం చేసి కొద్ది మొత్తాల్లో తాగవచ్చు. పొడ పత్రి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలసట, నీరసం తగ్గుతాయి. ఒత్తిడి, ఆందోళ నుంచి ఉపశమనం లభిస్తుంది. పొడపత్రి ఆకులను తీసుకోవడం వల్ల పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఇందుకు గాను ఆకులను రాత్రి పూట తినాల్సి ఉంటుంది.

**ఆర్థరైటిస్ నొప్పులకు..**

పొడపత్రి ఆకుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు సమృద్ధిగా ఉన్నాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ ఆకులను తినడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గిపోతాయి. పొడపత్రి ఆకుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉన్నాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించడంతోపాటు కణాలను రక్షిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పొడపత్రి ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. అందువల్ల ఈ ఆకులను తింటే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**డయాబెటిస్ సమస్యకు..**

పొడపత్రి ఆకుల్లో యాంటీ ఫాటిగ్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులను తింటే ఎంతటి నీరసం, అలసట అయినా త్వరగా తగ్గిపోతాయి. మళ్లీ చురుగ్గా మారుతారు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. పొడపత్రి ఆకుల్లో న్యూరో ప్రొటెక్టివ్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను తింటే నరాల బలహీనత తగ్గుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.



పొడపత్రి ఆకులను షుగర్ ఉన్నవారికి వరంగా చెప్పవచ్చు. ఈ ఆకులను తింటే షుగర్ లెవల్స్ క్రమంగా తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఈ ఆకులను తినడం వల్ల పిండి పదార్థాలు నెమ్మదిగా రక్తంలో కలుస్తాయి. దీంతో షుగర్‌ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవచ్చు.

**జాగ్రత్త అవసరం..**

పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం తీసి తాగవచ్చు. కానీ స్వల్ప మొత్తాల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఇది వ్యక్తి శరీర తత్వం, ఉన్న వ్యాధిని బట్టి మారుతుంది. కనుక ఈ ఆకులను వాడాలనుకుంటే ఆయుర్వేద వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకటి లేదా రెండు ఆకులను తినడం, ఒక టీస్పూన్ రసం సేవించడం సురక్షితంగా భావిస్తారు. పలు రకాల ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ పొడపత్రి ఆకులను విరివిగా ఉపయోగిస్తారు. రాత్రి పూట పొడపత్రి ఆకులను పాలతో తీసుకుంటే పురుషులకు మేలు జరుగుతుంది. గాయాలు, పుండ్లు, చర్మ సమస్యలను తగ్గించేందుకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు. కొద్దిగా పేస్ట్‌లా చేసి ఈ ఆకులను రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా తగ్గుతాయి. అయితే అలర్జీలు ఉన్నవారు ఈ ఆకులను వాడకూడదు.

# అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

### శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయ్ ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

## అప్పులతో ఎంతకాలమీ పాలన !

**న్యూఢిల్లీ :** ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబురించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖాజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారంఏటేటా తగ్గుతోంది.

# ప్రజా సమస్యలపై పోరాడేదెవరు ?



**న్యూఢిల్లీ :** దేశంలో సమస్య ఏదైనా ఉద్యమించాల్సిన అసవరం ఏర్పడింది. ఆయా వర్గాలు తమ అవస్థలను తెలియ చేసేందుకు ఎక్కడిక్కడ ఉద్యమ రూపంలో ప్రభుత్వాలకు తెలియచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక,ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరి స్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్దానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఇడి కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్దికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి ఉద్యమం చేయడానికి అడపాదడపా లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా..వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్దం కావాలి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసిపోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతక్యతను క్యాష్ చేసుకోవాలని బిజెపి ఊస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో నేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలిసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం దేశంలో ఏర్పడింది. ఎందుకంటే పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా..వారిలో నిజాయితీ కానరావడం లేదు. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ది కోసం తప్ప మరోటి కాదు. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలన కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

# కుట్రదారులను పట్టుకోవాల్సిందే !

**న్యూఢిల్లీ :** 2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్భంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్‌ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ–రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు– అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్‌ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్‌ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్‌ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్‌ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ–రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది.



## స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే
# ఉండిపోయా
### రాజాసాబ్ సినిమాపై మాళవికా మోహనన్

సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం మొద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి. ఆ నీటిలోనే 3 రోజులు షూట్ చేశాం. అదొక వింత అనుభవం' అని మాళవికా మోహనన్ అన్నారు. ఇకపోతే హారర్ ఫాంటసీ కామెడీ చిత్రంగా 'రాజాసాబ్' రానుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదని దర్శకుడు మారుతి తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆడియన్స్ వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారని చెప్పారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్‌దత్, బొమన్ ఇరాని, జరీనా వహబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా
# ప్రశాంత్ నీల్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

# అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ
### లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్



టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ప్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం. ఈ డీల్ విలువ వందల కోట్లలో ఉండొచ్చన్న ప్రచారం ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రిలీజ్‌కు ముందే ఇలాంటి రేంజ్ బిజినెస్ జరగడం బన్నీ మార్కెట్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.మరోవైపు, తన తాజా చిత్రం 'కూలీ'పై వచ్చిన విమర్శలపై దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇటీవల స్పందించారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్నానని, ఎక్కడ తడబడ్డామో విశ్లేషించుకున్నానని తెలిపారు. తదుపరి సినిమాల్లో మరింత బలమైన కంటెంట్‌తో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో అల్లు అర్జున్‌తో ఆయన చేయబోయే సినిమా మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందన్న అంచనాలు మరింత పెరిగాయి. మొత్తానికి అట్లీతో ఒక గ్రాండ్ సైన్స్ ఫిక్షన్ విజన్, లోకేశ్ కనగరాజ్‌తో ఒక రఫ్ అండ్ రియల్ ప్రాజెక్ట్ ఈ రెండు కాంబినేషన్లతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి

### లైన్ క్లియర్.. సాయిపల్లవి హిందీ
# డెబ్యూ సినిమా రిలీజ్‌పై క్లారిటీ..!

మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ సాయిపల్లవి. ఈ కోలీవుడ్ అమ్మడు తెలుగు, తమిళం, మలయాళంలో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఇక హిందీలో కూడా సాయిపల్లవి తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అవుతుందని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ నటిస్తోన్న మేరే రహెూ సినిమాలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫైనల్ చేశారన్న వార్త బయటకు వచ్చింది. లేటెస్ట్ టాక్ ప్రకారం మేరే రహెూ చిత్రాన్ని జులై రెండో వారంలో విడుదల చేయబోతున్నారట. రిలీజ్ డేట్‌పై మేకర్స్ రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి సాయిపల్లవి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హిందీ డెబ్యూ మూవీ ఈ ఏడాది సెకండాఫ్‌లో థియేటర్లలో సందడి చేయనుందన్న వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. 2025లో తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయిపల్లవి. ఈ భామ ఖాతాలో మరో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రామాయణ ఉంది. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుంది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న మేరే రహెూ మూవీని సునీల్ పాండే డైరెక్ట్ చేస్తున్నాడు.



Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103